# నేటి సాక్షి

తెలుగు దిన పత్రిక | TGTEL/25/A1737 | వాస్తవాలే వార్తలుగా..

12.04.2026 ఆదివారం Sunday | సంపుటి (volume): 1 సంచిక (Issue): 260 | పేజీలు : 11 Pages : 11 | వెల రూ. 2.00 | Published from : Hyderabad Circulated to : Telangana



**రిపోర్టర్లు కావలెను**

జర్నలిజంలో ఆసక్తి ఉన్నవారికి నేటి సాక్షి ఆహ్వానం పలుకుతుంది.

తెలుగు రాష్ట్రాలలో జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో రిపోర్టర్లుగా పని చేయుటకు ఆసక్తి, అనుభవం ఉన్నవారు ఈ క్రింది నంబర్లకు కాల్ చేసి సంప్రదించగలరు.

9119949944

7897222788 - 7897222789




4

## పార్లమెంట్‌లో ఆసక్తికర దృశ్యం

ప్రధాని మోదీ, రాహుల్ స్నేహపూర్వక సంభాషణ!

జ్యోతిబా ఫులే జయంతి వేడుకల్లో పరస్పరం పలకరించుకున్న నేతలు

## అక్షరాస్యతలో వెనుకబడిన తెలంగాణ



- విద్యా రంగం పూర్తిగా అస్తవ్యస్తం
- పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

.. వివరాలు 3లో



## పూలేకు సీఎం నివాళి

**ఢిల్లీ నివాసంలో ఘనంగా జయంతి.. పాల్గొన్న ఎంపీ మల్లు రవి**

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. ఢిల్లీలోని తన నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆ మహనీయుడి ఉన్నత్యాన్ని గుర్తుచేసుకున్నారు. జ్యోతిరావు పూలే చిత్రపటానికి ఎంపీ మల్లు రవి కూడా నివాళులర్పించారు. సామాజిక సమానత్వం కోసం పూలే చేసిన కృషిని ఈ సందర్భంగా స్మరించుకున్నారు.

# దక్షిణాది గొంతు నొక్కే కుట్ర

**ఉత్తరాదిలో ఎంపీ సీట్లు పెంచేందుకు కేంద్రం ప్లాన్**



## పన్నులు మనవి.. నిధులు వాళ్లకా?

**2011 జనాభా లెక్కల ఆధారంగా పునర్విభజన సరికాదు**

**42 శాతం రిజర్వేషన్ బిల్లు కేంద్ర వద్ద పెండింగ్**

**బీసీ సబ్ ప్లాన్ అంశంపై ఆలోచన చేస్తాం : డిప్యూటీ సీఎం భట్టి**



**హైదరాబాద్, ఏప్రిల్ 11:** కుల గణన చేస్తామని ప్రకటించిన కేంద్రం ఆ లెక్కలు పరిగణలోకి తీసుకోకుండా 2011 జనాభా లెక్కల ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది రాష్ట్రాల ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన రవీంద్ర భారతి తో ఏర్పాటు చేసిన మహాత్మా పూలే ద్విశతాబ్ది జయంతి వేడుకల సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ 2011 జనాభా లెక్కల ప్రకారం మాత్రమే పరిగణలో తీసుకొని నియోజకవర్గాల పునర్విభజన చేపడితే దక్షిణాది

మిగతా 2 లో

"దక్షిణాది రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం చూపుతున్న వివక్షను ప్రతి ఒక్కరూ గమనించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. మన దగ్గర పన్నులు వసూలు చేస్తూ ఉత్తరాదికి నిధులు ధారపోస్తున్నారని విమర్శించారు. ఇప్పుడు డిలిమిటేషన్ పేరుతో ఉత్తరాదిలో ఎంపీ స్థానాలను పెంచి దక్షిణాది ప్రాధాన్యతను తగ్గించే కుట్ర జరుగుతోందన్నారు. దక్షిణాది గొంతు నొక్కాలని చూస్తున్న ఈ రాజకీయ కుట్రలను బహుజనులు, ప్రజాస్వామ్యవాదులు ఏకమై తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. సామాజిక మార్పు కోసం అందరూ కలిసి రావాలన్నారు."

## నేడు ఇంటర్ ఫలితాల విడుదల



.. వివరాలు 3లో

## కొత్తతరం నాయకత్వం రావాలి

అరాచక పాలన అంతానికి యువత ముందుకు రావాలి

- రాబోయేవి అసెంబ్లీ ఎన్నికలు కాదు.. కేసీఆర్ ఎన్నికలే
- అబద్ధపు హామీలతో రేవంత్ సర్కార్ డబ్బా
- ఇబ్రహీంపట్నం కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

3



## అమీన్‌పూర్‌లో హైడ్రా ఆపరేషన్

- రూ.15 వేల కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం!
- కోర్టు ఆర్డర్లు బేఖాతరు చేస్తూ నిర్మించిన గెస్ట్ హౌస్
- 6 అంతస్తుల భవనం నేలమట్టం

2





## వెనక్కి తగ్గని ఇరాన్

షరతులకు అంగీకరిస్తేనే చర్చలని స్పష్టీకరణ!

అమెరికా బృందం ఉపాధ్యక్షుడికి పాక్ స్వాగతం

4

## మా వద్ద నాణ్యమైన చమురు ఉంది

కొనడానికి ముందుకు రండి: ట్రంప్ పిలుపు



# అంబులెన్స్‌ను ఢీకొన్న ప్రైవేట్ బస్సు

## ప్రమాదంలో ఇద్దరు మృతి..ఒకరికి గాయాలు

**కామారెడ్డి, ఏప్రిల్ 11:** కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి వద్ద 44వ జాతీయ రహదారిపై శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. హైదరాబాద్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న అంబులెన్స్‌ను వేగంగా దూసుకొచ్చిన ప్రైవేటు బస్సు వెనక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అంబులెన్స్‌లో ఉన్న పేషెంట్ సలేహా భాను(63), అంబులెన్స్ డ్రైవర్ షేక్ సర్దార్ (35) ఘటనా స్థలిలోనే మృతి చెందారు. పేషెంట్ భర్త సైఫుల్లా ఖాన్ (76) తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వ్యక్తిని స్థానిక ఆస్పత్రికి తరలించారు. సలేహా భాను ఆరోగ్యం క్షీణించడంతో ఆమెను హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రి నుంచి ఆదిలాబాద్‌లోని స్వగ్రామానికి తరలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే వెనుక నుంచి అతి వేగంగా దూసుకొచ్చిన ప్రైవేట్ బస్సు ఢీకొనడంతో అంబులెన్స్ తీవ్రంగా దెబ్బతిన్నట్లు సమాచారం. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు అక్కడకు చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బస్సు డ్రైవర్‌పై నిర్లక్ష్యంగా వాహనం నడపడం, అతి వేగం వంటి ఆరోపణలతో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ప్రమాదంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. వెంటనే పోలీసులు ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

# న్యాయవాదికి బెదిరింపులు

## గాయని మంగ్లీ తదితరులపై కేసు

**హైదరాబాద్, ఏప్రిల్ 11:** తెలుగు రాష్ట్రాల్లో ఫోక్ సాంగ్స్‌తో విశేష గుర్తింపు తెచ్చుకున్న ప్రముఖ గాయని మంగ్లీ ఇప్పుడు వివాదంలో చిక్కుకున్నారు. పెట్టుబడుల పేరుతో డబ్బులు సేకరించి మోసం చేయడం, అలాగే న్యాయవాదిని బెదిరించడం వంటి ఆరోపణలపై ఆమెపై కేసు నమోదవడం సంచలనంగా మారింది. పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో నమోదైన ఈ కేసు ప్రకారం, మంగ్లీ, ఆమె సోదరుడు శివ, మరికొంత మంది కలిసి సుమారు 100 మంది నుంచి భారీ మొత్తంలో నిధులు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. వ్యాపారంలో పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామని నమ్మించి ఈ డబ్బులు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. అయితే, కాలం గడుస్తున్నా ఎటువంటి లాభాలు ఇవ్వకపోవడం మాత్రమే కాకుండా, పెట్టుబడిగా ఇచ్చిన అసలు డబ్బును కూడా తిరిగి ఇవ్వలేదని బాధితులు ఆరోపిస్తున్నారు. దీంతో వారు ఆందోళన చెందుతూ న్యాయం కోసం న్యాయవాది సుబ్బారావును ఆశ్రయించారు. ఈ వ్యవహారంలో న్యాయవాది జోక్యం చేసుకోవడంతో వివాదం మరింత ముదిరింది. బాధితుల తరపున డబ్బులు తిరిగి ఇవ్వాలని నిలదీయగా, మంగ్లీ మరియు ఆమె బృందం నుంచి బెదిరింపులు వచ్చాయని సుబ్బారావు తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇంకా, ఈ కేసులో దర్శకుడు వేణు ఊడుగుల పేరు కూడా వెలుగులోకి రావడం గమనార్హం. మంగ్లీ, శివ, వేణు ఊడుగుల కలిసి ఫోన్ ద్వారా తీవ్రంగా బెదిరించారని, తనను యాక్సిడెంట్ చేయించి చంపేస్తామని హెచ్చరించారని న్యాయవాది ఆరోపించారు. ఈ నేపథ్యంలో తనకు ప్రాణహాని ఉందని పేర్కొంటూ పోలీసుల వద్ద రక్షణ కోరారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టి, మంగ్లీ, శివ, వేణు ఊడుగుల, ఇతరులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసును పోలీసులు సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు ప్రారంభించారు. వరుస హిట్ పాటలతో కెరీర్‌లో దూసుకుపోతున్న మంగ్లీపై ఈ తరహా ఆరోపణలు రావడం సినీ, సంగీత రంగాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో నిజానిజాలు ఏవో దర్యాప్తులో తేలాల్సి ఉంది. కాగా, తన పాటలతో మంచి ఫేమ్ అందిపుచ్చుకున్న మంగ్లీ వివాదాలతో ఇమేజ్ బ్యాడ్ చేసుకుంటుంది.

### లాయర్ ఫిర్యాదుకు ప్రతిగా మంగ్లీ కేసు

సుభా సియపోగు అనే న్యాయవాది తనను వేధిస్తున్నాడంటూ నార్సింగి పోలీసులను మంగ్లీ ఆశ్రయించారు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ, అప్రతిష్ఠ పాలు చేస్తానని బెదిరిస్తున్నారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. మంగ్లీ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తాను రూ.150 కోట్ల మోసానికి పాల్పడ్డానంటూ సుభా సింగబోష్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని మంగ్లీ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఆరోపణల్లో ఎలాంటి నిజం లేదని ఆమె స్పష్టం చేశారు. మార్చి 21న సుభా సియపోగు పేరుతో ఒక వ్యక్తి తనను పరిచయం చేసుకున్నాడని, అప్పటి నుంచి అమర్యాదగా, బెదిరించే ధోరణిలో మాట్లాడుతున్నాడని ఫిర్యాదులో వివరించారు. తనను కలవాలని సదరు వ్యక్తి తీవ్ర ఒత్తిడి చేశాడని, అందుకు నిరాకరించడంతో సోషల్ మీడియాలో, బయట అప్రతిష్ట పాలు చేస్తానని బెదిరించినట్లు మంగ్లీ ఆరోపించారు. తనకు ఎలాంటి సంబంధం లేని కరెన్సీ నోట్లు ఉన్న వీడియోలను చూపించి, మరో వ్యక్తితో కలిసి తనపై అవమానకర వ్యాఖ్యలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆమె పేర్కొన్నారు. తన వ్యక్తిగత ప్రతిష్ట దెబ్బతింటోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. మంగ్లీ ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించిన నార్సింగి పోలీసులు, నిందితుడు సుభా సింగబోష్‌పై బిఎన్ఎస్ సెక్షన్లు 79, 351(3) కింద కేసు నమోదు చేశారు. అయితే ఇప్పటికే మంగ్లీపై పంజగుట్ట స్టేషన్‌లో న్యాయవాది కేసు నమోదు చేశారు. దీంతో పరస్పరం కేసులు నమోదు అయ్యాయి.

# ఎక్సైజ్ కమిషనర్ తీరుతో మనస్తాపం

## ఉద్యోగానికి డిప్యూటీ కమిషనర్ రాజీనామా

**నిజామాబాద్, ఏప్రిల్ 11:** జిల్లా ఎక్సైజ్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ మధ్య వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. ఎక్సైజ్ కమిషనర్ తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి దూషిస్తున్నారని డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి ఆరోపించారు. తన 30 ఏళ్ల సేవలను వదులుకుంటూ ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సామాజిక మాధ్యమం ద్వారా ప్రకటించారు. ఎక్సైజ్ కమిషనర్ మాటలతో మనస్తాపం చెంది, ఆస్పత్రి పాలైనట్లు ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎక్సైజ్ కమిషనర్ మాటలు, వేధింపులు తట్టుకోలేకే ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు సోమిరెడ్డి తెలిపారు. బదిలీల్లో మానవతా దృక్పథంతో వ్యవహరించాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. లోయర్ క్యాడర్ ఉద్యోగుల ముందు కమిషనర్ ఇష్టానుసారం మాట్లాడడం బాధ కలిగించిందని భావోద్వేగానికి గురయ్యారు. ఆత్మాభిమానాన్ని చంపుకొని ఉద్యోగం చెయ్యలేనంటూ ప్రభుత్వానికి డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి లేఖ సైతం రాశారు.

# నేడు ఇంటర్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్, ఏప్రిల్ 11:** తెలంగాణ ఇంటర్ పరీక్ష ఫలితాల విడుదలకు రంగం సిద్ధమైంది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరాల ఫలితాలను ఆదివారం విడుదల చేయనున్నట్లు ఇంటర్ బోర్డు అధికారికంగా ప్రకటించింది. ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఈ ఫలితాలు విడుదల కానున్నాయి. వెబ్‌సైట్‌లలో విద్యార్థులు తమ రోల్ నంబర్ ఎంటర్ చేయడం ద్వారా ఒక్క క్లిక్‌తోనే రిజల్ట్స్‌ని పొందొచ్చు. రిజల్ట్స్‌ని వాట్సప్‌లోనే పొందేలా ఏర్పాటు చేసింది. స్మార్ట్ ఫోన్‌లలో 80969 58096 నంబర్‌ను సేవ్ చేసుకొని 'హాయ్ అని టైప్ చేయడం ద్వారా ఫలితాలు చెక్ చేసుకోవచ్చు.

# దక్షిణాది గొంతు నొక్కే కుట్ర

మొదటి పేజీ తరువాయి



అవసరం లేకుండానే కేంద్రంలో ప్రభుత్వాలు ఏర్పడతాయని తెలిపారు. కుల గణన చేయకుండా నియోజకవర్గాల విభజన చేపడితే ఫలితం మరోరకంగా ఉంటుందని డిప్యూటీ సీఎం అన్నారు. దక్షిణాది రాష్ట్రాలు పెద్ద ఎత్తున సామాజిక మార్పునకు నాంది పలుకుతున్నాయని, కేంద్రంపై ఒత్తిడి తెస్తున్నాయని ద్రవిడ రాష్ట్రాలను బలహీన పరిచేందుకు కేంద్రం నుంచి వచ్చే పన్నుల వాటాలో భారీగా తగ్గింపులు చేశారని డిప్యూటీ సీఎం వివరించారు. తెలంగాణ నుంచి పన్నుల రూపేనా ఒక రూపాయి కేంద్రానికి వెళితే తిరిగి రాష్ట్రానికి 37 పైసలు మాత్రమే వస్తుందని, తమిళనాడు నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 29 పైసలు, కేరళ నుంచి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి 61 పైసలు మాత్రమే వస్తున్నాయని తెలిపారు. అదే ఉత్తరాది బీహార్ నుంచి కేంద్రానికి రూపాయి వెళితే తిరిగి కేంద్రం నుంచి ఆ రాష్ట్రానికి 6.53 రూపాయలు వెళుతున్నాయని, ఉత్తరప్రదేశ్ నుంచి కేంద్ర ప్రభుత్వానికి రూపాయి వెళితే తిరిగి ఆ రాష్ట్రానికి పన్నుల వాటాల రూపంలో 2.17 రూపాయలు వెళుతున్నాయని వివరించారు. దక్షిణాది రాష్ట్రాల పట్ల జరుగుతున్న వివక్ష, కేంద్రం ఉద్యమాలను కట్టడి చేస్తున్న తీరు, నియోజకవర్గాల పునర్విభజన అంశంపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో ఇటీవల పెద్ద ఎత్తున చర్చ జరిగిందని డిప్యూటీ సీఎం తెలిపారు. నియోజక వర్గాల పునర్విభజనలో కుల గణన ను పరిగణలోకి తీసుకోక పోతే యావత్ భారత దేశంలోని బలహీన వర్గాలకు నష్టం జరుగుతుందని, మనకోసం మనం పోరాడాల్సిన అవసరం ఏర్పడిందని డిప్యూటీ సీఎం తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి ప్రజా ప్రభుత్వం బడ్జెట్లో పెద్ద ఎత్తున ప్రజలే కేంద్రంగా నిధులు కేటాయించింది ఇదే జరిగితే తమకు పెద్ద ఎత్తున నష్టం జరుగుతుందని భావించి రాష్ట్రంలో ఫ్యూడల్ శక్తుల పునరేకికరణ ప్రయత్నం జరుగుతుందని డిప్యూటీ సీఎం హెచ్చరించారు. బహుజనులు ఏకం కావాలి ప్రజా ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని కాంగ్రెస్ అమల్లోకి తీసుకువచ్చింది బీసీ సబ్ ప్లాన్ డిమాండ్ తాజాగా తెరపైకి వచ్చింది ఈ అంశాన్ని కాంగ్రెస్ పార్టీ, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ఆలోచన చేస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. అంతరాలు లేని సమాజం కోసం జనాభా ఆధారంగా నిధులు కేటాయించాలి, జనాభా దామాషా ప్రకారం నిధులు ఖర్చు చేసినప్పుడే సకల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని తెలిపారు. సామాజిక న్యాయం కోసం తమ ప్రభుత్వం కట్టుబడి ఉంది ఎన్ని అవాంతరాలు వచ్చినా నిటారుగా నిలబడుతుందని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. భారతదేశంలో కులం అనేది వాస్తవం అధికారంలోకి రాగానే కుల సర్వే చేపడతామని మా నాయకుడు రాహుల్ గాంధీ ఎన్నికల ముందు ప్రకటించారు. మహాత్మ పూలే ఆలోచనలను ఏ చిన్న అవకాశం దక్కిన, ప్రతి సందర్భంలో పూర్తిస్థాయిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని తెలిపారు. కుల వివక్ష, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా కుంగిపోకుండా తట్టుకొని నిలబడాలి అని ఆచరించి భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలబడ్డారు అందుకే మహాత్మా పూలే మహానుభావుడు అయ్యారు అని తెలిపారు. ప్రజా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ ఓసి అన్ని వర్గాల పిల్లలు 12వ తరగతి వరకు ఒకే చోట చదువుకునేలా అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మిస్తున్నామని తెలిపారు. అధికారంలోకి రాగానే 40 శాతం డైట్ 200శాతం కాస్మోటిక్ చార్జీలు పెంచామని, మన బిడ్డలు ఎవరు అర్ధాకలితో ఉండకూడదనే మంచి ఉద్దేశంతో ప్రతిరోజు నాణ్యమైన డైట్ ను అందించడమే కాదు వాటిని పర్యవేక్షించేందుకు చీఫ్ సెక్రటరీ నుంచి మండల స్థాయి అధికారి వరకు సీఎం నుంచి సర్పంచి వరకు గురుకులాలు సంక్షేమ వసతి గృహాలు సందర్శించాలి అవసరమైతే అక్కడే నిద్రించాలని నిబంధన పెట్టి ఎప్పటికప్పుడు నివేదికలు తీసుకుంటున్నట్టు వివరించారు. జూన్ 2 నుంచి ప్రభుత్వ పాఠశాలల్లోనే 20 లక్షల మంది విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం పథకం ప్రారంభిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో 15 కోట్లతో సకల సౌకర్యాలతో తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని డిప్యూటీ సీఎం ప్రకటించారు. కుల వృత్తులపై ఆధారపడి జీవనం సాగిస్తున్న వారికి ఉచితంగా విద్యుత్తు అందిస్తున్నామని తెలిపారు.

# పారదర్శకంగానే మేడారం గద్దెల నిర్మాణం

## అవినీతిపై ఆధారాలు ఉంటే చూపాలి

## సెల్‌ఫోన్ కొనుగోళ్లపైనా కువిమర్శలు తగవు

## మంత్రి సీతక్క మరోమారు గట్టిగా జవాబు

**ములుగు, ఏప్రిల్ 11:** మేడారం సమ్మక్క– సారక్క అమ్మవార్ల గద్దెల పునర్నిర్మాణ పనుల్లో ఎక్కడ అవినీతి జరగలేదని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. గ్దదెల పున: నిర్మాణ పనుల్లో అవినీతి జరిగిందని అంటున్నారని.. ఆధారాలు ఉంటే చూపించాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. అవసరమైతే సీబీఐ విచారణ జరపాలని సూచించారు. శనివారం ములుగులో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ పర్యటించారు. మహేశ్ గౌడ్‌కు గట్టమ్మ దేవాలయం వద్ద మంత్రి సీతక్క, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. గట్టమ్మ దేవాలయంలో మహేశ్ కుమార్ గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గట్టమ్మ దేవాలయం నుంచి భారీ బైక్ ర్యాలీగా ములుగు పట్టణ కేంద్రానికి నాయకులు, కార్యకర్తలు బయలుదేరారు. నాపై తప్పుడు ప్రచారం చేశారు.. ఈ సందర్భంగా కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో మంత్రి సీతక్క మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడాన్ని బీఆర్ఎస్ నేతలు తట్టుకోలేకపోతున్నారని విమర్శించారు. ఎన్నికల్లో తనను ఓడించేందుకు రూ.వందల కోట్లు



ఖర్చుచేశారని, తనపై తప్పుడు ప్రచారం చేశారని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు తనను ప్రలోభాలకు గురిచేశారని.. అయినా తాను వారికి లొంగలేదని చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లకు ఇచ్చే ఫోన్లలో అవినీతి జరిగిందని... అవినీతి సీతక్క అంటున్నారని.. జాగ్రత్తగా మాట్లాడాలని హెచ్చరించారు. తానెక్కడా అవినీతి చేయలేదని స్పష్టం చేశారు. రూ.11,650లకు ఫోన్లు కొంటే.. రూ.14000వేలని ప్రచారం చేస్తున్నారని మంత్రి సీతక్క ఆగ్రహించారు. ఇష్టానుసారంగా ఆరోపణలు చేసే ప్రతిపక్షాలకు మంత్రి సీతక్క వార్నింగ్ ఇచ్చారు. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోం.. చట్టపరమైన చర్యలు తప్పవు. దమ్మުంటే మీ ఆరోపణలు నిరూపించండంటూ సవాల్ విసిరారు. ములుగులో పోషణ పక్వాడ సందడి కార్యక్రమాన్ని ప్రారంభించారు మంత్రి సీతక్క. ఈ సందర్భంగా గత ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. గత ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీల పరిస్థితి అత్యంత దయనీయమన్నారు సీతక్క. కరెంటు లేదు, తాగునీరు లేదు, కనీస మౌలిక సదుపాయాలు లేవన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 12,500 అంగన్‌వాడీలకు భవనాలే లేకపోయినా నాటి పాలకులు పట్టించుకోలేదన్నారు. కానీ తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే మార్పు మొదలైందదన్నారు. ఇప్పటికే రెండు వేల కొత్త అంగన్‌వాడీ భవనాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామని చెప్పారు. కేవలం పౌష్టికాహారం అందించడమే కాదు.. అంగన్‌వాడీలను సకల సౌకర్యాలతో 'ప్రీ-ప్రైమరీ స్కూల్స్'గా తీర్చిదిద్దుతుంటే.. అది ఓర్వలేక కొన్ని పార్టీలు అసత్య ఆరోపణలు చేస్తున్నాయని విమర్శించారు సీతక్క. ఇక సెల్ ఫోన్ల కొనుగోలుపై క్లారిటీ ఇస్తూ.. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగానే ఐదుగురు నిపుణులైన అధికారుల కమిటీ పర్యవేక్షణలో అత్యంత పారదర్శకంగా టెండర్లు నిర్వహించామని స్పష్టం చేశారు. విమర్శలు పక్కన పెట్టి ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతామని సీతక్క చెప్పారు.

# అమీన్‌పూర్‌లో హైడ్రా ఆపరేషన్


## రూ.15 వేల కోట్ల ప్రభుత్వ భూమి స్వాధీనం!

## కోర్టు ఆర్డర్లు బేఖాతరు చేస్తూ నిర్మించిన గెస్ట్ హౌస్

## 6 అంతస్తుల భవనం నేలమట్టం

**సంగారెడ్డి, ఏప్రిల్ 11:** సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్‌లో హైడ్రా భారీ ఆపరేషన్ చేపట్టింది. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఆక్రమణలను కూల్చి వేస్తోంది. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి ఈ భారీ ఆపరేషన్‌ను నిర్వహిస్తోంది. కోర్టు స్టే ఆర్డర్ ఉన్నా.. నిర్మాణాలు జరిపిన ఓ గెస్ట్ హౌస్‌తో పాటు, ఆరు అంతస్తుల భవనాన్ని హైడ్రా కూల్చివేస్తోంది. ఐలాపురం తండాతో పాటు గ్రామంలోని పేదల ఇళ్ల జోలికి వెళ్లకుండా ఖాళీ స్థలాలను హైడ్రా స్వాధీనం చేసుకుటోంది. సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మండలం ఐలాపురం గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే చాలా నివాసాలు వెలిశాయి. ఆ నివాసాల జోలికి వెళ్లకుండా మిగిలి ఉన్న 860 ఎకరాల ప్రభుత్వ భూమిని రక్షించేందుకు చర్యలు చేపట్టింది. 863 ఎకరాల భూమి విలువ రూ.15 వేల కోట్లకు పైగా ఉంటుందని అంచనా. ఇక్కడ యథాతథ స్థితిని కొనసాగించాలని 1998 నుంచి కోర్టు ఆర్డర్లున్నా పట్టించుకోకుండా నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా తొలగించింది. అలాగే ఎలాంటి





అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని తొలగిస్తోంది. ఐలాపురం తండాలో కానీ, గ్రామంలోని నివాస గృహాల జోలికి కానీ వెళ్లకుండా చర్యలు చేపట్టినట్లు హైడ్రా అధికారులు స్పష్టం చేశారు. కేవలం అక్రమంగా నిర్మించిన భారీ కట్టడాలు, ఖాళీ స్థలాల స్వాధీనంపైనే దృష్టి సారించినట్లు తెలిపారు. 1998 నుంచి 'స్టేటస్ కో' కొనసాగించాలని కోర్టు ఆర్డర్లు ఉన్నప్పటికీ, వాటిని ఖాతరు చేయకుండా ముఖీమ్ నిర్మించిన గెస్ట్ హౌస్‌ను హైడ్రా నేలమట్టం చేసింది. అలాగే అతని సోదరుడు అజీమ్ ఎటువంటి అనుమతులు లేకుండా నిర్మించిన 6 అంతస్తుల భవనాన్ని కూడా అధికారులు తొలంచారు. ఐలాపూర్ గ్రామంలో మొత్తం 1263 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఇప్పటికే అనేక నివాసాలు వెలిశాయి. మిగిలి ఉన్న 860 ఎకరాల ఖాళీ ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవడమే లక్ష్యంగా హైడ్రా ఈ ఆపరేషన్ చేపట్టింది. ఈ భూమి విలువ సుమారు రూ.15 వేల కోట్ల పైమాటే ఉందని అంచనా. కూల్చివేతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులను మోహరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా భారీగా పోలీసులు మోహరించారు. హైడ్రా చేపట్టిన ఈ భారీ ఆపరేషన్ వల్ల వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా కాపాడగలిగారు.



# పంటకొనుగోళ్లలో తీవ్ర నిర్లక్ష్యం

- సిద్దిపేట యార్డులో రైతుల ఆందోళన
- సందర్శించిన ఎమ్మెల్యే హరీష్ రావు



**సిద్దిపేట, ఏప్రిల్ 11:** పంట కొనుగోలు చేయకుండా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, సిద్దిపేట బిఆర్ఎస్ ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ ప్రభుత్వ అలసత్వంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆగ్రహించారు. శనివారం సిద్దిపేట వ్యవసాయ మార్కెట్ యార్డ్‌ని హరీశ్‌రావు సందర్శించారు. పొద్దు తిరుగుడు, మొక్కజొన్న ధాన్యాన్ని నాలుగు రోజుల నుంచి కొనుగోలు చేయడం లేదని హరీశ్‌రావుకి రైతులు విన్నవించారు. అన్నదాతల సమస్యలు విని అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. పూలే జయంతీ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రైతుల పట్ల కాంగ్రెస్ సర్కార్ చిన్నచూపు చూపుతోందని ధ్వజమెత్తారు. నారాయణఖేడ్, ఆదిలాబాద్, నిజామాబాద్ కేంద్రాల్లో మొక్కజొన్న కొనుగోలు సెంటర్‌లను ఎందుకు ప్రారంభించలేదని ప్రశ్నించారు. వెంటనే కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించి మద్దతు ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ యార్డ్‌లను అధికారులు సందర్శించాలని అన్నారు. చాలా చోట్ల కొనుగోలు సెంటర్‌లు ప్రారంభించకపోవడంతో తక్కువ ధరకు అమ్ముకుని రైతులు నష్టపోతున్నారని చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి పంట మార్పిడి చేయమని చెబుతున్నారు.. కానీ రైతులు పంట మార్పిడి చేస్తే వాటిని కొనే దిక్కు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను ఇబ్బంది పెడుతోందని ్గ÷ర్ అయ్యారు. పలు జిల్లాల్లో వడగళ్ల వర్షాల వల్ల పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సమయానికి రైతు బంధు ఇవ్వాలని కోరారు. బీసీలను రేవంత్‌రెడ్డి ప్రభుత్వం దగా చేసిందని దుయ్యబట్టారు. బీసీ డిక్లరేషన్ పేరుతో రేవంత్‌రెడ్డి బీసీలను మోసం చేశారని ఆగ్రహించారు. కేసీఆర్ హయాంలో అన్ని కుల వృత్తులను ప్రోత్సహించామని చెప్పుకొచ్చారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# అక్షరాస్యతలో వెనుకబడిన తెలంగాణ

- విద్యా రంగం పూర్తిగా అస్తవ్యస్తం
- పూలే ఆశయాలకు కాంగ్రెస్ తూట్లు
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్




**హైదరాబాద్, ఏప్రిల్ 11:** ప్రముఖ సామాజిక తత్వవేత్త, ఉద్యమకారుడు మహాత్మా జ్యోతిరావు పూలే ద్విశతాబ్ది జయంతి సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా నివాళులర్పించారు. అణచివేతపై తిరుగుబాటుకు కేరాఫ్ అడ్రస్.. బడుగు, బలహీన వర్గాలకు కొండంత ధైర్యం.. మహాత్మా జ్యోతిరావు పూలే అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు బండి సంజయ్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఏ సమాజమైతే చదువు పరంగా, ఆర్థికంగా ఎదుగుతుందో అప్పుడే ఆ సమాజం అభివృద్ధి చెందుతుందని ఆశించిడమే కాకుండా అందుకోసం చివరిదాకా కృషి చేసిన మహనీయుడు పూలే అని కొనియాడారు. ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను అభిమానించే జ్యోతిరావు పూలే కుల వివక్షపై అలుపెరగని పోరాటం చేశారని కీర్తించారు. ఆ రోజుల్లోనే వితంతు పునర్వివాహాలు జరపడంతోపాటు బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని ప్రశంసించారు. మహిళల చదువు కోసం నిరంతరం పాటు పడ్డారని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం జ్యోతిరావు పూలే ఆశయాలకు, స్ఫూర్తికి భిన్నంగా పాలన కొనసాగిస్తోందని బండి సంజయ్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యాశాఖ పనితీరు దారుణంగా ఉందని తెలిపారు. అక్షరాస్యతలో జాతీయ సగటు కంటే తెలంగాణ పూర్తిగా వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. ఏళ్ల తరబడి ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవడంతో లక్షలాది మంది పేద, మధ్యతరగతి ప్రజలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారని చెప్పుకొచ్చారు. ఆరోగ్య శ్రీ బకాయిలు ఏళ్ల తరబడి చెల్లించకపోవడంతో కార్పొరేట్, ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్య శ్రీ కార్డుపై చికిత్స చేయించుకోలేని దుస్థితి ఏర్పడిందని తెలిపారు. ప్రభుత్వ భూములను ఎడాపెడా అమ్ముతూ భవిష్యత్తు తరాలకు గజం జాగా కూడా లేకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తోందన్నారు. ఇకనైనా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం పూలే ఆశయాలను మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని బండి సంజయ్ కోరారు. పూలే దీనబంధు అనే పత్రికను స్థాపించి బీదల, కార్మికుల సమస్యలను సమాజానికి తెలిసేలా చేశారని బండి సంజయ్ కుమార్ ప్రస్తావించారు. అట్టడుగు వర్గాల్లో విజ్ఞానాన్ని నింపడానికి, పేదలను ఆదుకోవడానికి సర్వస్వం త్యాగం చేసిన మహోన్నతుడు పూలే అని చెప్పారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పూలేను గురువుగా ప్రకటించుకున్నారంటే ఆయన గొప్పదనం ఏంటో అర్థమవుతుందని అన్నారు. సతీమణి సావిత్రీబాయి పూలేతో కలిసి విద్యా ఉద్యమాన్ని ప్రారంభించి ఏకంగా 52 పాఠశాలలను ప్రారంభించి వేలాది మంది పేదలకు అక్షర జా&ఝనాన్ని అందించిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని కొనియాడారు. స్వాతంత్ర్యం÷-ర రాని రోజుల్లోనే నిర్బంధాలను, అణిచివేతలను తట్టుకుంటూ అణగారిన వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు తెచ్చేందుకు జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని కీర్తించారు.

# కొత్తతరం నాయకత్వం రావాలి

- అరాచక పాలన అంతానికి యువత ముందుకు రావాలి
- రాబోయేవి అసెంబ్లీ ఎన్నికలు కాదు.. కేసీఆర్ ఎన్నికలే
- అబద్ధపు హామీలతో రేవంత్ సర్కార్ డబ్బా
- ఇబ్రహీంపట్నం కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్



**హైదరాబాద్, ఏప్రిల్ 11:** ఈ అరాచక పాలనను అంతమొందించాలంటే కొత్తతరం నాయకత్వం రావాల్సిన అవసరం ఉందని,. రాబోయే రోజుల్లో ఎన్నికలు ఎప్పుడొచ్చినా అవి కేసీఆర్ ఎన్నికలుగానే ఉంటాయి.. అసెంబ్లీ ఎన్నికలు కాదు. కేసీఆర్ ఎన్నికలే ఈ రాష్ట్రంలో జరుగుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వచ్చే ఎన్నికలే జరుగుతయని నాకు విశ్వాసం ఉందన్నారు. ఇది నా ఆలోచన కాదు.. రాష్ట్రంలో ఎవరినైనా అన్నా ఎట్లున్నది పరిస్థితి అని అడగండి. రైతన్నల బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నేను జగిత్యాలకు పోతే అక్కడ ఓ రైతు సోదరుడు కలిసిండు. అన్న ఎట్లున్నది పరిస్థితి అని అడిగిన. ఆ ఏముంది సార్ మూడు సార్లు రైతు బంధు ఎగ్గొట్టిండు. రూ.27 వేల కోట్లు మిగిలినయి. అందులో నుంచి 20 వేల కోట్లు ఇచ్చి రుణమాఫీ చేసినా అని డబ్బా కొట్టుకుంటున్నడు. మా పైసలు మాకే ఇచ్చి మిదికెల్లి బాకీ ఉన్నడు.. కానీ బయటకు మాత్రం రైతు బంధు ఎగ్గొట్టిన అని చెప్పడు. రుణమాఫీ చేసినా అని చెప్పి.. అది కూడా ఊరిలో చారానా మందికి చేసిండు. బారానా మందికి కాలేదు. అగో గట్లుంది పాలనా అని ఒకే ఒక్కమాటలో రైతన్న చెబుతున్నడని అంటూ ఎద్దేవా చేశారు. ఏ యువకుడినైనా అడగండి రెండు లక్షల ఉద్యోగాలని ఊరించి పెద్ద పెద్ద మాటలు చెప్పి చివరకు మోసం చేసి గద్దెనెక్కి.. ఇంతవరకు రెండున్నర సంవత్సరాల్లో 11 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదు. మహిళలకు స్కూటీలు, తులం బంగారం అన్నడు.. నెలకు రూ.2500 ఇస్తా అన్నడు.. అత్తకు రూ.4 వేలు, కోడలుకు రెండున్నర వేలు నోటికి ఎంతొస్తే అంత మాటలిచ్చి మహిళలను మోసం చేసిండు. కేసీఆర్ రాకముందు 200 పెన్షన్ వచ్చేది. కేసీఆర్ దాన్ని రూ.2 వేలు చేసిండు. నవంబర్‌లో అయితే రూ.2వేలు, డిసెంబర్‌లో అయితే 4 వేలు అని చెప్పిండు. ముసలోళ్లను కూడా మోసం చేసిండు. రెండు నెలలు ఇప్పటికీ పెన్షన్ ఎగ్గొట్టిండు. 28 నెలల్లో సాధించింది ఏమైనా ఉందంటే ఒకే ఒక్కటి ఢిల్లీకి పోవుడు. వచ్చుడు.. ఎక్కే విమానం.. పోయే విమానం తప్ప ఈ రాష్ట్రంలో చేసింది మాత్రం ఏమీ లేదన్నాడు. మీ ఎమ్మెల్యే గురించైతే నేను చెప్పే అవసరమే లేదు. ఆయన ఎట్లాంటోడో ఏమేం వసూళ్లు చేస్తడో నాకంటే బాగా మీకే తెలుసు. ఆఖరికి అరటి పండ్ల బండ్లను కూడా విడిచిపెట్టడట అని కేటీఆర్ ఎద్దేవా చేశారు. గట్లాంటోడి గురించి నేను మాట్లాడ కని.. ఒకటి మాత్రం పక్కా. మంచి రెడ్డి లాంటి మంచి నాయకుడిని కోల్పోవడం వల్ల ఆయనకేం నష్టం కాలేదు. ఆయన బాగానే ఉన్నడు.. కానీ నష్టపోయింది ఇబ్రహీం పట్నం ప్రజలు అని గుర్తు చేస్తున్నా. మంచి నాయకుడు కేసీఆర్‌ను కోల్పోయినం. ఇబ్రహీంపట్నంలో మంచి రెడ్డి కిషన్ రెడ్డి లాంటి మంచి నాయకుడిని పోగోట్టుకున్నం. అందుకే ఈ ప్రభుత్వం చేస్తున్న అరాచకలు నా కంటే బాగా మీకే తెలుసనన్నారు కేటీఆర్. కేసీఆర్ నాయకత్వంలో 14 వేల ఎకరాలు సేకరించి గ్రీన్ ఫార్మా సిటీ పెట్టాలని పట్టుబట్టామని అన్నారు. స్టేట్ ఆఫ్ ది ఆర్ట్.. అంటే ప్రపంచంలోనే అత్యున్నతమైన ప్రమాణాలతో స్థానికంగా కాలుష్యమనేది లేకుండా అక్కడే బాగా చేయాలనే ఉద్దేశంతో దాదాపు 7 సంవత్సరాలు కిషన్ రెడ్డి, సబితక్క, నేను కష్టపడి చాలా మందిని ఒప్పించి మెప్పించి కొంత ఇబ్బంది పెట్టి కూడా రైతులకు మొక్కాలే.. తడ్లాండి 14 వేల ఎకరాలు సేకరించినమని చెప్పుకొచ్చారు. అయితే ఇప్పుడేం జరుగుతున్నదో చూస్తున్నామని అన్నారు.




# వర్ణ వివక్షపై పోరాటం ఆదర్శనీయం

**సామాజిక విప్లవకారుడు పూలేకు కేసీఆర్ నివాళి**

**హైదరాబాద్, ఏప్రిల్ 11:** వర్ణ వివక్షకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడిన సామాజిక విప్లవకారుడు, సమ సమాజ స్థాపన మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన సేవలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్మరించుకున్నారు. భారత సమాజంలో వర్ణ, కుల, లింగ వివక్షను రూపుమాపి సామాజిక న్యాయం అందించిన దార్శనికుడు పూలే అని కొనియాడారు. సబ్బండ వర్ణాలు సామాజిక, ఆర్థిక రంగాల్లో ఎదగాలంటే విద్య ఒక్కటే మార్గమని పూలే చెప్పిన మాటలు ఎల్లప్పుడూ ఆచరణీయమని తెలిపారు. తన భార్య సావిత్రి బాయి పూలేకు చదువు నేర్పించి, మహిళా విద్య కోసం అనేక కష్టాలను ఎదుర్కొన్న గొప్ప సంకల్పం ఆయనదని ప్రశంసించారు. పూలే ఆశయాలకు అనుగుణంగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో సబ్బండ కులాల అభ్యున్నతికి కృషి చేసిందని కేసీఆర్ గుర్తు చేశారు. సాగునీరు, విద్యుత్, రైతు బంధు, రైతు బీమా వంటి పథకాలతో వ్యవసాయ రంగాన్ని పటిష్టం చేశామన్నారు. గొర్రెల పెంపకం, చేపల పంపిణీ, నేతన్నకు చేయూత వంటి వృత్తి కులాల ప్రోత్సాహక పథకాలతో దళిత బహుజనులు ఆర్థికంగా నిలదొక్కుకున్నారని తెలిపారు. దీనివల్ల తెలంగాణ గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు పునరుజ్జీవం లభించిందని చెప్పారు. ఆసరా పెన్షన్లు, బీసీ బంధు వంటి పథకాలతో వెనుకబడిన కులాల అభివృద్ధికి బాటలు వేశామని పేర్కొన్నారు. బీసీ కులాల విద్య కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ విద్యాసంస్థలు ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయి చదువును అందించామని కేసీఆర్ వివరించారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో బీసీ కులాల ఆత్మగౌరవం నిలబడేలా అత్యంత విలువైన స్థలాలు, నిధులు కేటాయించి ఆత్మగౌరవ భవనాల నిర్మాణం చేపట్టామన్నారు. పూలే ఆశయాల మేరకు తాము ప్రారంభించిన ప్రగతి పథకాలను ప్రస్తుత ప్రభుత్వం కూడా చిత్తశుద్ధితో కొనసాగించాలని సూచించారు. అప్పుడే మహాత్మా పూలేకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు.

# 20న మోతెలో భారీ బహిరంగ సభ

**సభాస్థలిని పరిశీలించిన బీఆర్ఎస్ నేతలు**

**జగిత్యాల, ఏప్రిల్ 11:** జగిత్యాల జిల్లా మోతెలో ఈ నెల 20వ తేదీన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భారీ బహిరంగ సభ జరగనుంది. ఈ సందర్భంగా సభాస్థలిని పార్టీ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్యే కల్వంకుట్ల సంజయ్, మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, జీవన్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, తుల ఉమ పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. ఈ నెల 20న మోతెలో కేసీఆర్ భారీ బహిరంగ సభ ఉండబోతుందని తెలిపారు. లక్షకు పైగా జనాభాకు అనుగుణంగా సభాస్థలిని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ.. ప్రజాభీష్టం మేరకే జీవన్ రెడ్డి బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రెండున్నరేళ్లలో తెలంగాణ అస్తవ్యస్తమైందని విమర్శించారు. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. జీవన్ రెడ్డి ఏనాడూ అధికారం కోసం పాకులాడలేదని కల్వకుంట్ల సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ చేసిన అభివృద్ధిని గుర్తించిన ఆయన బీఆర్ఎస్‌లో చేరారని తెలిపారు. స్థానిక ప్రజలు, కార్యకర్తల అభిప్రాయంతోనే బీఆర్ఎస్‌లోకి జీవన్ రెడ్డి వచ్చారని పేర్కొన్నారు. జీవన్ రెడ్డి మార్గదర్శనం, సూచనలతో ముందుకెళ్తామని స్పష్టం చేశారు.

# గజ్వేల్ రింగ్ రోడ్డు పనులు పూర్తి చేయండి

**పెండింగ్ పనులు పరిశీలించిన బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్**

**సిద్దిపేట, ఏప్రిల్ 11:** గజ్వేల్ అభివృద్ధికి ఈ రింగ్ రోడ్డు కీలకమైనదని.. నిలిచిపోయిన పనులను వెంటనే పూర్తి చేసేలా సీఎం రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు తెలిపారు. శనివారం గజ్వేల్ పట్టణంలో అసంపూర్తిగా ఉన్న రింగ్ రోడ్డును రఘునందన్ రావు పరిశీలించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నర్మెట్టకు వచ్చినప్పుడు అసంపూర్తిగా ఉన్నా గజ్వేల్ రింగ్ రోడ్డు వ్యవహారం గురించి వివరించానని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లినప్పుడు పరిష్కరిస్తామని సభ వేదికగా చెప్పారని ప్రస్తావించారు. రింగ్ రోడ్డు పూర్తి కావడానికి 151 మీటర్ల భూ సేకరణ పెండింగ్‌లో ఉందని వెల్లడించారు. ఒక రైతుని పిలిచి ఒప్పించడంలో జిల్లా రెవెన్యూ యంత్రాంగం అంతా కూడా నిర్లక్ష్యంగా ఉన్నారని మండిపడ్డారు. రింగ్ రోడ్డు వ్యవహారంలో సమస్య ఎక్కడ ఉందో తెలుసుకోవడానికి తానే స్వయంగా వచ్చి పరిశీలించానని తెలిపారు. జిల్లా ఎంపీగా భూమి ఇచ్చే రైతుతో మాట్లాడి ఈ పనులపై చొరవ తీసుకుంటానని అన్నారు. ఒక వేళ రైతు భూమి ఇచ్చే వ్యవహారంలో అంగీకరించని పక్షంలో చట్టప్రకారం చర్యలు తీసుకునే విధంగా కృషి చేస్తానని ఎంపీ రఘునందన్ రావు పేర్కొన్నారు.

# 13 నుంచి 18 వరకు అరైవ్-అలైవ్ కార్యక్రమం

**ప్రజాపాలనలో రోడ్డు భద్రతపై చైతన్యం : డీజీపీ శివధర్ రెడ్డి**

**హైదరాబాద్, ఏప్రిల్ 11:** రోడ్డు ప్రమాదాలు నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా అరైవ్–అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వంలో ఉన్న అన్ని శాఖల సమన్వయంతో పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ఈనెల 13వ తేదీ నుంచి 18వ తేదీ వరకు అరైవ్–అలైవ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కువ రోడ్డు ప్రమాదాలు మన దేశంలోనే జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, రోడ్డు వెంట ఉన్న వారు ఎక్కువ సంఖ్యలో మృతిచెందుతున్నారని తెలిపారు.ప్రజా సంక్షేమం, భద్రతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలుచేస్తోందని అన్నారు. గ్రామాల్లో ఉన్న ఎంపీటీసీలు, సర్పంచ్‌ల నుంచి సీఎం వరకు ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలంగాణ ప్రభుత్వం ఆదేశించినట్లు డీజీపీ తెలిపారు. ప్రతి గ్రామంలో రోడ్ సేఫ్టీ కమిటీని 8 నుంచి 9 మందితో ఏర్పాటు చేయాలని, దానిలో విరమణ పొందిన ఉద్యోగులు, మహిళలు, స్వచ్ఛంద సంస్థల బాధ్యులు ఉండేలా చూడాలని సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీజీపీ శివధర్ రెడ్డి పిలుపునిచ్చారు



సంపాదకీయం

# ఆత్మరక్షణలో కాంగ్రెస్!

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక బిఆర్ఎస్ అవినీతి కొట్టుకు పోయింది. వారిని విచారిస్తామన్న కేసులు వెనక్కి పోయాయి. కాళశ్వరం, కార్ రేసు, ధరణివంటి వన్నీ ఇప్పుడు వెనక్కి పోయాయి. పదేపదే బిఆర్ఎస్ నేతలపై అవినీతి ఆరోపణలు చేసిన సిఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా బిఆర్ఎస్ నేతల అవినీతి గురించి నిరూపించలేకపోయారు. ఇది యాదృచ్ఛికమా లేక మరేదైనా కారణం ఉందా అన్నది తెలియదు. ఈ క్రమంలో కాంగ్రెస్ మంత్రులపై అవినీతి అంశం తెరపైకి వచ్చింది.మంత్రులం దరిపైనా అంతో ఇంతో బురదపడుతూనే ఉంది. ప్రధానంగా మంత్రి పొగులేటిపై విపరీతమైన ఆరోపణలు వస్తున్నాయి. వాటిని ఆయన ఖండిస్తున్నా...ప్రజల్లో నమ్మకం కలగడం లేదు. తమపై బురదజల్లుతున్నారని మంత్రులు పొంగులేటి తదితరులు అంటున్నారు. నిప్పులేనిదే పొగరాదు. ప్రభుత్వంలో ఉంటూ అవినీతి గురించి ఆరోపణలు వచ్చినప్పుడు నేరుగా స్పందించాలి. నిజనిర్ధారణ జరగాలి. ముఖ్యంగా నాదర్‌గుల్ భూములపై తీవ్ర ఆరోపణలు వచ్చాయి. ఆయన తనయుడకి భాగం ఉందని ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో అక్కడి భూములు ప్రభుత్వానివే అయితే చర్యలు తీసుకుని ఉంటే నమ్మకం కలిగేది. కానీ అలా జరగలేదు. ఇవి ప్రభుత్వ భూములే అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మీడియా సమావేశంలో చెప్పి కంపెనీలకు వత్తాసు పలికారే గానీ రైతుల గురించి ఒక్కమాటైనా చెప్పలేదని తాజాగా రైతులు నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష నేతలను విమర్శించడం కాదు, రైతులకు ఏం చేస్తదో చెప్పాలని పట్టుబట్టారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీయే కదా.. మీరే న్యాయం చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో నాదర్‌గుల్ రైతులు కదంతొక్కారు. దశాబ్దాలుగా సాగుచేసుకుంటున్న భూములకు దూరమై భూపోరాటానికి దిగిన రైతు కుటుంబాలు.. శుక్రవారం మరోసారి తమ భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్‌సైన్యంపై విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ నేతలను కడిగిపారేసిన నాదర్‌గుల్ రైతులు ÷ూజకీయాలు చేయడం మానుకొని రైతులకు ఎలా న్యాయం చేస్తారో చెప్పాలని నాదర్‌గుల్ రైతులు కాంగ్రెస్ నేతలకు తెగేసి చెప్పారు. ప్రతిరోజూ రైతులు వంటావార్పుతో పాటు పలు రీతుల్లో నిరసన కొనసాగిస్తుండగా భూపోరాటానికి బీఆర్ఎస్ సహా వామపక్ష పార్టీలు, ఇతర ప్రజాసంఘాలు వారికి మద్దతు పలికాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సైతం సంఘీభావం తెలుపుదామని భావించారు. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నేతల ఆదేశానుసారం స్థానిక నాయకులు శుక్రవారం రైతుల వద్దకు వెళ్లి సమావేశం ఏర్పాటు చేశారు. వచ్చీరాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం, మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితాఇంద్రారెడ్డిపై ఆరోపణలు గుప్పించడంతో రైతులు అడ్డుకున్నారు. రెండున్నరేండ్లుగా భూముల్లోకి వెళ్లనివ్వకుండా ప్రైవేట్ కంపెనీలు ఇబ్బందులు పెడుతుంటే ఎందుకు పట్టించుకోలేదని రైతులు నిలదీశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కాంగ్రెస్ పెద్దల వద్దకు వెళ్తే ఎవరూ న్యాయం చేయలేదని, గోడు వినలేదని ప్రశ్నించారు. రైతులు మాటలతో ఎదురుదాడి చేయడంతో హస్తం నేతలు కంగుతిన్నారు. ఏదో అనుకుంటో ఏదో జరిగిందని వారి ప్రశ్నలకు సమాధానం చెప్పకుండానే వెనుదిరిగారు. వాస్తవానికి రైతుల్లో విభేదాలు సృష్టించేందుకే కాంగ్రెస్ నేతలు వచ్చారని పలువురు రైతులు ఆరోపించారు.ఆ కంపెనీలు వేసిన రేకుల కంచెను దాటుకొని, పోలీసులు, బౌన్సర్లను సైతం లెక్క చేయకుండా భూముల్లోకి చొచ్చుకొని వెళ్లారు. ఈ అనూహ్య పరిణామాలతో అక్కడ కొన్ని గంటల పాటు ఉద్రిక్తత నెలకొన్నది. తమకు సంఘీభావం తెలిపేందుకు వచ్చిన ధర్మసమాజ్ పార్టీ అధ్యక్షుడు విశారదన్ మహరాజ్‌ను తీసుకొని లోపలికి పోయేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు మెయిన్ గేటు వద్దే నిలువరించారు. చాలాసేపు వాగ్వాదం చేసిన తర్వాత గేటు తీసి లోపలికి వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు తాళ్లు పట్టుకొని గేటుకు అడ్డుగా రక్షణ వలయంగా నిల్చున్నా రైతులు లెక్క చేయలేదు.ఎన్ని కేసులు పెట్టుకుంటారో పెట్టుకోండి అంటూ ముందుకు తోసుకుంటూ వెళ్లారు. లోపలి వైపు ప్రైవేట్ సైన్యం గేటును అదిమిపట్టినా రైతులు పట్టువీడకపోవడంతో ఒక్కసారిగా గేటు తెరుచుకుంది. దీంతో పదుల సంఖ్యలో రైతులు లోపలికి వెళ్లి బౌన్సర్లను తరిమికొట్టారు. ఒకేసారి పెద్ద ఎత్తున రైతులు రావడంతో బౌన్సర్లు భయంతో భూముల్లోకి పరుగులు తీశారు. రెండేండ్లుగా తమల్ని తమ భూముల్లోకి వెళ్లనివ్వకుండా అడ్డుకుంటున్న బౌన్సర్లపై తీవ్ర ఆగ్రహంతో ఉన్న రైతులు వారిని ఉరికించారు. ఈ క్రమంలో కొంతమంది బౌన్సర్లు గుంతల్లో పడిపోగా మరికొందరిని రైతులు పట్టుకొని దాడి చేసేందుకు ప్రయత్నించడంతో పరిస్థితి గందరగోళంగా మారింది. అయితే ఎవరిపైనా దాడులు చేయొద్దని విశారదన్ మహరాజ్ వచ్చి రైతుల్ని వారించి, బౌన్సర్లను అక్కడినుంచి పంపించారు. ఆ తర్వాత రైతులు భూముల వద్దకు వెళ్లి ప్రైవేట్ కంపెనీలు ధ్వంసం చేసిన బోర్లను, బావులను పూడ్చిన తీరును విశారదన్ మహరాజ్‌కు చూపించారు. పొలాల కోసం వేసుకున్న పైపులను కూడా ధ్వంసం చేశారని, కాలువలను లేకుండా చేశారని, కరెంటు వైర్లను తగులబెట్టారని రైతులు వాటిని చూపుతూ ఆవేదన చెందారు. చాలాకాలం తర్వాత పొలాల్లోకి వెళ్లినందుకు రైతులంతా సంతోషం వ్యక్తం చేశారు. ఇంత జరుగుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వంలో చలనం లేదు. మొన్న వట్టినాగుల పల్లి, ఇవాళ నాదర్‌గుల్ భూముల విషయంలో ప్రభుత్వం తీరుపై అనుమానాలు ఉన్నాయి. వీటిపై నిజాలు చెప్పాల్సిన బాధ్యత సిఎం రేవంత్ రెడ్డిపై ఉంది.

# వెనక్కి తగ్గని ఇరాన్

- షరతులకు అంగీకరిస్తేనే చర్చలని స్పష్టీకరణ!
- అమెరికా బృందం ఉపాధ్యక్షుడికి పాక్ ప్రధాని స్వాగతం



**ఇస్లామాబాద్, ఏప్రిల్ 11:** పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలను తొలగించి శాంతిని నెలకొల్పడమే లక్ష్యంగా పాకిస్థాన్ వేదికగా జరగాల్సిన అమెరికా-ఇరాన్ చర్చలపై సందిగ్ధత కొనసాగుతోంది. పాక్ రాజధాని ఇస్లామాబాద్‌లో అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం అడుగుపెట్టి గంటలు గడుస్తున్నా, ఇరాన్ ప్రతినిధులతో నేరుగా భేటీ ఇంకా సాధ్యపడలేదు. తమ డిమాండ్లను నెరవేరిస్తేనే ముఖాముఖి చర్చలకు కూర్చుంటామని ఇరాన్ భీష్మించుకోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. ముఖ్యంగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులను తక్షణమే నిలిపివేయాలని, అక్కడ పూర్తిస్థాయి కాల్పుల విరమణ అమలులోకి రావాలని ఇరాన్ పట్టుబడుతోంది. దీనితో పాటు ఖతార్‌తో సహా ఇతర అంతర్జాతీయ బ్యాంకుల్లో స్తంభింపజేసిన తమ నిధులను అమెరికా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తోంది. ఇరాన్‌పై ఉన్న ఆర్థిక ఆంక్షలను సడలించడంతో పాటు గత యుద్ధ నష్టపరిహారాన్ని కూడా చెల్లించాలని ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ మొహమ్మద్ బాఘెర్ గాలిబాఫ్ స్పష్టం చేశారు. మరోవైపు అమెరికా బృందానికి నాయకత్వం వహిస్తున్న ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ఇస్లామాబాద్ చేరుకున్న తర్వాత పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో సుదీర్ఘంగా చర్చించారు. అంతకుముందు విమానం ఎక్కే సమయంలో వాన్స్ మాట్లాడుతూ తాము శాంతికి సిద్ధంగా ఉన్నామని, కానీ ఇరాన్ తమను తప్పుదారి పట్టించాలని చూస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించడం ఉత్కంఠ రేపుతోంది. వాన్స్ బృందంలో మాజీ అధ్యక్షుడి అల్లుడు జారెడ్ కుష్నర్, ప్రత్యేక దూత స్టీవ్ విట్కాఫ్ కూడా ఉన్నారు. ప్రస్తుతానికి ఇరు దేశాల ప్రతినిధులు ఒకే హోటల్‌లో విడిది చేసినప్పటికీ నేరుగా కలవలేదు. పాక్ అధికారులే అటు అమెరికా బృందంతోనూ, ఇటు ఇరాన్ విదేశాంగ మంత్రి అరాగ్చీ నేతృత్వంలోని బృందంతోనూ వేర్వేరుగా భేటీ అవుతూ రాయబారం నడుపుతున్నారు. అమెరికా ఈ షరతులపై మెత్తబడితేనే రేపు నేరుగా చర్చలు జరిగే అవకాశం ఉంది. ప్రపంచ చమురు మార్కెట్‌కు కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్' పునరుద్ధరణ కూడా ఈ చర్చల ఎజెండాలో ప్రధానాంశంగా ఉంది.

## చర్చలు విఫలమైతే మరిన్ని దాడులు : ట్రంప్

**న్యూయార్క్:** ఇరాన్, అమెరికా దేశాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందం కొనసాగుతున్న వేళ శనివారం పాకిస్థాన్‌లో రెండు దేశాల మధ్య చర్చలకు దిగారు. ఈ చర్చలు ఎలాంటి ఫలితాలను ఇస్తాయన్న దానిపై యావత్ ప్రపంచం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తోంది. ఇరాన్‌తో అమెరికా చర్చలు జరపనున్న వేళ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోమారు ఇరాన్‌కు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు. అంతర్జాతీయ జలమార్గాలను బ్లాక్ చేయడం తప్ప.. ఇరాన్ దగ్గర మరో అస్త్రం లేదని అన్నారు. హోర్ముజ్ జలసంధిని తెరవాలన్నది తమ డిమాండ్ అని తేల్చి చెప్పారు. చర్చలు విఫలమైతే ఇరాన్‌పై మరిన్ని దాడులు చేస్తామని అన్నారు. అత్యుత్తమ ఆయుధాలతో సైన్యం ఇరాన్‌పై దాడి చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. ఇరాన్ బలగాలు సైనికంగా ఓడిపోయాయని అన్నారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదని స్పష్టం చేశారు. చర్చల ఫలితంతో సంబంధం లేకుండా.. హోర్ముజ్ జలసంధి దానంతట అదే తెరుచుకుంటుందని, త్వరలోనే హోర్ముజ్ జలసంధి తెరుచుకునేలా చేస్తామని అన్నారు. కాగా, ఇరాన్‌తో చర్చల నేపథ్యంలో ట్రంప్ తన సొంత సోషల్ మీడియాప్లాట్‌ఫామ్ ది ట్రూత్‌లో ఇరాన్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వరుస పోస్టులు పెడుతున్నారు.

# మా వద్ద నాణ్యమైన చమురు ఉంది

- కొనడానికి ముందుకు రండి: ట్రంప్ పిలుపు



**వాషింగ్టన్, ఏప్రిల్ 11:** ఇరాన్‌తో శాంతి చర్చలకు ముందు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. రెండు అతిపెద్ద చమురు ఆర్థిక వ్యవస్థలైన రష్యా, సౌదీ అరేబియా కంటే తమ వద్దే ఎక్కువ చమురు ఉందన్నారు. ప్రపంచంలోనే అత్యంత నాణ్యత కలిగిన చమురు, గ్యాస్‌ను నింపుకోవడానికి ప్రపంచ దేశాలకు చెందిన అనేక ఖాళీ చమురు ట్యాంకర్లు అమెరికా తీరం వైపు వస్తున్నాయని పేర్కొన్నారు. 'మేము మీకోసం ఎదురు చూస్తున్నాం.. త్వరితగతిన స్పందించండి' అంటూ ప్రపంచ దేశాలకు పిలుపునిచ్చారు. ప్రపంచంలో ఎక్కడికైనా చమురు ఎగుమతి చేసేందుకు అమెరికా సిద్ధంగా ఉందన్నారు. మరికొన్ని గంటల్లో ఇరుదేశాల మధ్య చర్చలు ప్రారంభమవ్వనున్న నేపథ్యంలో ఇరాన్ అమెరికాకు పలు షరతులు విధిస్తుండడంతో కాల్పుల విరమణ ప్రయత్నాలు ఆలస్యమవుతున్నాయి. ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ బృందం పాకిస్థాన్‌కు వచ్చి నాలుగు గంటలకు పైగా అయినప్పటికీ, ఇరాన్ ప్రతినిధులతో ఇంకా ప్రత్యక్ష చర్చలు జరపలేదు. పాకిస్థాన్ ప్రధాని షరీఫ్ ఇప్పటికే వాన్స్‌తో సమావేశమయ్యారు. ప్రస్తుతం ఇరాన్ అధికారుల బృందం పాక్ అధికారులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. లెబనాన్‌లో కాల్పుల విరమణ, స్తంభింపజేసిన ఇరాన్ నిధుల విడుదల అనే రెండు షరతులను ఇరాన్ అమెరికా ముందు ఉంచింది. అవి అమలైతేనే చర్చలు జరుగుతాయని స్పష్టం చేసింది.



# హోర్ముజ్ దాటిన భారతీయ నౌక

## కాల్పుల విరమణ తరవాత ఇదే తొలి ప్రయాణం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:** యూఎస్, ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరాక తొలిసారిగా ఒక భారత రిజిస్టర్డ్ నౌక హోర్ముజ్ జలసంధిని సురక్షితంగా దాటింది. ఎల్‌పీజీతో బయలుదేరిన జగ్ విక్రమ్ నౌక శుక్రవారం రాత్రి జలసంధిని దాటినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. దీంతో, మార్చి నుంచి ఇప్పటివరకూ హోర్ముజ్‌ను దాటిన భారత సరకు రవాణా నౌకల సంఖ్య 9కి చేరింది. అంతేకాకుండా, ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ జలాల్లో మరో 15 భారత రిజిస్టర్డ్ నౌకలు ఉన్నాయి. ఇవి కూడా త్వరలో హోర్ముజ్‌ను దాటనున్నట్టు తెలుస్తోంది. శనివారం మధ్యాహ్నానికి జగ్ విక్రమ్ నౌక హోర్ముజ్‌కు తూర్పున ఉన్న గల్ఫ్ ఆఫ్ ఒమాన్ జలాల్లో ప్రయాణిస్తోంది. ఈ నౌకలో సుమారు 20 వేల టన్నుల ఎల్‌పీజీ ఉన్నట్టు సమాచారం. మధ్యస్థాయి సరకు రవాణా సామర్థ్యం కలిగిన ఈ నౌక ముంబైలోని గ్రేట్ ఈస్టర్న్ కంపెనీకి చెందినది. మరికొన్ని రోజుల్లో ఈ నౌక భారత్‌కు చేరుకుంటుంది. గల్ఫ్‌లో ఉద్రిక్తతలు మొదలైన నాటి నుంచీ అనేక నౌకలు హోర్ముజ్‌కు పశ్చిమాన ఉన్న పర్షియన్ గల్ఫ్ జలాల్లో నిలిచిపోయాయి. జగ్ విక్రమ్‌తో పోలిస్తే రెండింతల సామర్థ్యం ఉన్న గ్యాస్ క్యారియర్లు కూడా వీటిల్లో ఉన్నాయి. ఇక ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్‌లోని భారత నౌకల్లో ఒక ఎల్‌పీజీ ట్యాంకర్, నాలుగు ముడి చమురు ట్యాంకర్లు, ఒక ఎల్ఎన్‌జీ క్యారియర్, ఒక కెమికల్ ఉత్పత్తుల ట్యాంకర్, మూడు కంటెయినర్ ట్యాంకర్లు, రెండు బల్క్ క్యారియర్లు ఉన్నాయి. వీటితో పాటు కొన్ని ట్యాంకర్లకు మరమ్మతులు జరుగుతున్నట్టు సమాచారం.

# పార్లమెంట్‌లో ఆసక్తికర దృశ్యం



- ప్రధాని మోదీ, రాహుల్ స్నేహపూర్వక సంభాషణ!
- జ్యోతిబా పులే జయంతి వేడుకల్లో పరస్పరం పలకరించుకున్న నేతలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 11 :** రాజకీయ రణక్షేత్రంలో విమర్శల బాణాలు సంధించుకునే ప్రధాన ప్రత్యర్థులు పార్లమెంటు ప్రాంగణంలో మాత్రం ప్రజాస్వామ్య స్ఫూర్తిని చాటుతూ స్నేహపూర్వకంగా ముచ్చటించారు. మహాత్మా జ్యోతిబా ఫులే 200వ జయంతి సందర్భంగా శనివారం పార్లమెంటులోని 'ప్రేరణా స్థల్' వద్ద నివాళులర్పించేందుకు వచ్చిన ప్రధాని నరేంద్ర మోదీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ కొద్దిసేపు ప్రత్యేకంగా సంభాషించుకోవడం అందరి దృష్టిని ఆకర్షించింది. కార్యక్రమానికి చేరుకున్న ప్రధాని మోదీ తొలుత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, స్పీకర్ ఓం బిర్లా, కేంద్ర మంత్రి జేపీ నడ్డాలతో పాటు రాహుల్ గాంధీని పలకరిస్తూ ముందుకు సాగారు. అయితే, కొద్ది క్షణాల తర్వాత మళ్లీ వెనక్కి వచ్చిన ప్రధాని, రాహుల్ గాంధీతో ప్రత్యేకంగా మాట్లాడటం చర్చనీయాంశమైంది. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల వేళ ఇరు నేతల మధ్య తీవ్రమైన వాగ్వివాదాలు సాగుతున్న తరుణంలో, ఈ అనూహ్య భేటీకి సంబంధించిన వీడియో ఇప్పుడు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇటీవలి కాలంలో విదేశాంగ విధానంపై రాహుల్ గాంధీ చేసిన విమర్శలు, వాటిని ప్రధాని తిప్పికొట్టిన తీరు రాజకీయంగా వేడి పుట్టించాయి. ట్రంప్ నిర్దేశాల మేరకే మోదీ పాలన సాగుతోందని రాహుల్ ఆరోపించగా, ఆయనను 'స్వయం ప్రకటిత రాజకుమారుడు' అంటూ ప్రధాని ఎద్దేవా చేశారు. ఇటువంటి ఘాటైన రాజకీయ వాతావరణం నెలకొన్నప్పటికీ, పార్లమెంటు ప్రాంగణంలో ఒకరినొకరు గౌరవించుకుంటూ ముచ్చటించడం భారతీయ ప్రజాస్వామ్య గొప్పతనానికి నిదర్శనమని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# రోడ్డుపైనే రాత పరీక్ష

## బిహార్‌లో విద్యావ్యవస్థ దుస్థితి!



**సివాన్, ఏప్రిల్ 11:** వింతలు, వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారే బిహార్ విద్యావ్యవస్థ మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో విమానాశ్రయ రన్‌వేపై పరీక్షలు రాసి వార్తల్లోకెక్కిన అక్కడి విద్యార్థులు, ఇప్పుడు ఏకంగా రోడ్డు పక్కన కూర్చుని పరీక్షలు రాస్తూ కనిపించడం నెటిజన్లను విస్మయానికి గురిచేస్తోంది. సివాన్ జిల్లాలో చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సివాన్ జిల్లాలోని ఒక ప్రైవేట్ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్ విద్యార్థులకు ఇటీవల పరీక్షలు నిర్వహించింది. అయితే, విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా తరగతి గదిలో వసతులు, కుర్చీలు లేకపోవడంతో యాజమాన్యం వినూత్నంగా (అయినా ప్రమాదకరంగా) ఆలోచించింది. విద్యార్థులను తరగతి గదిలో కాకుండా బయట రోడ్డుకు ఇరువైపులా కూర్చోబెట్టింది. కనీసం కూర్చోవడానికి బెంచీలు కూడా లేకపోవడంతో చాలామంది కిందనే కూర్చొని, మరికొందరు నిలబడి పరీక్షలు రాయాల్సి వచ్చింది. పక్కనే వాహనాలు హారన్లు కొడుతూ వెళ్తున్నా, జనం రాకపోకలు సాగుతున్నా.. ఆ రొద మధ్యే విద్యార్థులు తీవ్రమైన ఎండలో తలలు వంచుకుని పరీక్షలు రాశారు. ఈ దృశ్యాలపై సోషల్ మీడియాలో నెటిజన్లు తీవ్రస్థాయిలో మండిపడుతున్నారు. "బిహార్‌లో అక్షరాస్యత తక్కువగా ఉండటానికి ఇటువంటి దారుణమైన పరిస్థితులే కారణం" అని ఒకరు కామెంట్ చేయగా, "ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు లేక ప్రైవేట్ సెంటర్లకు వెళ్తే, అక్కడ అంతకంటే హీనంగా ఉందంటూ" మరొకరు విమర్శించారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్ | ఆదివారం 1 2 ఏప్రియల్ 2026

## ఆర్టిజన్ల సమస్యలు పరిష్కరించాలి

గవినోళ్ళ శ్రీనివాస్



**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** తెలంగాణ ఉద్యమంలో విద్యుత్ శాఖ ఉద్యోగులు అత్యంత కీలక పాత్ర పోషించారని తెలంగాణ జాగృతి నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గవినోళ్ళ శ్రీనివాస్ కొనియాడారు. విద్యుత్ శాఖ ఆర్టిజన్ కార్మికులు చేపట్టిన సమ్మె శనివారంతో నాలుగో రోజుకు చేరుకోగా, ఆయన సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఉద్యమ సమయంలో విద్యుత్ ఉద్యోగులు పాల్గొనడం వల్లే కేంద్రానికి తెలంగాణ ఆకాంక్ష బలంగా అర్థమైందని గుర్తు చేశారు. గతంలో ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆర్టిజన్ల వెట్టిచాకిరి గురించి మాట్లాడిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి హోదాలో వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే రాష్ట్రం అంధకారంలోకి వెళ్లే ప్రమాదం ఉందని, ఇప్పటికే కేటీపీఎస్‌లో గ్రిడ్ల పరిస్థితి ఆందోళనకరంగా ఉందని ఆయన హెచ్చరించారు. ప్రభుత్వ యాజమాన్యం కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమం మరింత ఉధృతమవుతుందని, దీనికి జాగృతి తరఫున పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ ఆర్టిజన్ నాయకులు లక్ష్మీకాంత్, వినోద్, నర్సింలు, రమేష్, అంజి, అమ్రేష్, నర్సింహా, రాఘవేంద్ర గౌడ్, మహమ్మద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడిని కలిసిన అన్వర్ సదాత్



**నేటి సాక్షి,నారాయణపేట (ఇమామ్ సాబ్):** ఎన్ఎస్‌యూఐ(NSUI) 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని నారాయణపేట జిల్లా నాయకులు అన్వర్ సదాత్ శనివారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో రాష్ట్ర నాయకత్వాన్ని కలిశారు. ఈ సందర్భంగా ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు యడవెల్లి వెంకట స్వామి మరియు సౌత్ ఇండియా లీగల్ సెల్ అధ్యక్షుడు ఎండీ అక్బర్‌లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలో విద్యార్థి సంఘం బలోపేతం మరియు భవిష్యత్ కార్యాచరణపై వారితో చర్చించారు. ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా గాంధీ భవన్‌లో జరిగిన ప్రత్యేక సమావేశంలో అన్వర్ సదాత్ పాల్గొని, జిల్లాలోని విద్యార్థుల సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎన్ఎస్‌యూఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పాములపాడులో పూలే జయంతి

ఘనంగా నివాళులు అర్పించిన తెలుగు తమ్ముళ్లు



**నేటి సాక్షి,పాములపాడు:** పాములపాడు మండల కేంద్రంలో గొప్ప సంఘసంస్కర్త మహాత్మా జ్యోతి రావు పూలే 199 వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మండల నాయకులు, పాములపాడు సొసైటీ ఛైర్మెన్ రాయపాటి గోవిందు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు లింగాల. నాగరాజు, టిడిపి మండల సెల్ అధ్యక్షుడు కంభం.మోహన్ గౌడ్, తెలుగుయువత మండల అధ్యక్షుడు షేక్.కరీం బాష, మండల బిసి సెల్ ఉపాధ్యక్షుడు నాగరాజు, మండల ఎస్టి సెల్ అధ్యక్షుడు సోమ్లు నాయక్, మైనారిటీ నాయకులు హాఫిజ్, ఎంఎస్పి మండల అధ్యక్షుడు బొల్లెద్దుల మోహన్ లు మాట్లాడుతూ సమాజంలో ఉన్న కులవివక్షను నిర్మూలించడానికి, అణగారిన వర్గాల హక్కుల కోసం, దళితుల మరియు మహిళల విద్యకోసం సత్యశోదక్ సమాజ్ ను ఏర్పాటు చేసి విద్యను అందించారని, మహాత్మా జ్యోతిరావు పూలే గొప్ప సంఘ సంస్కర్త అని ఆయన ఆశయాలను మనమందరం కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాయిని మధు, తెలుగుయువత ఉపాధ్యక్షుడు విక్రమ్ గౌడ్, నాగ లింగమయ్య,శంకర్ రాములు నాయక్, జనార్ధన్ నాయక్, వెంకటేష్, సద్దాం, బ్రహ్మయ్య, తదితర నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# పూలే ఆశయాలను ఆచరించాలి





- ఘనంగా మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు
- విద్యతోనే సామాజిక వికాసం సాధ్యమని చాటిచెప్పిన మహనీయుడు

**నేటి సాక్షి, జగిత్యాల,(రాధారపు నర్సయ్య):** మహాత్మా జ్యోతిబా పూలే ఆశయాలను, ఆలోచనలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సూచించారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పూలే 200వ జయంతి వేడుకల్లో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్‌లతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి, పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. ఏప్రిల్ మాసం మహనీయుల మాసమని, విద్యా విప్లవానికి నాంది పలికిన పూలే, మహిళల విద్య కోసం తొలి పాఠశాలను స్థాపించిన ఘనత పొందారని కొనియాడారు. అణగారిన వర్గాల అభ్యున్నతికి ఆయన చూపిన మార్గమే ప్రస్తుత ప్రభుత్వానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. జిల్లాలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామని, రెసిడెన్షియల్ పాఠశాలల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారందరికీ అవకాశం కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ యువత పూలే ఆశయాలను ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లత, మున్సిపల్ చైర్మన్ సమిండ్ల వాణి, వివిధ శాఖల అధికారులు మరియు కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కళాకారుల బృందం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

# ఔటర్ రింగ్ రోడ్ పనులు వెంటనే పూర్తి చేయాలి





- గజ్వేల్ రింగ్ రోడ్ పనుల పరిశీలన చేసిన మెదక్ ఎంపీ రఘునందన్ రావు
- "రైతు సమస్య పరిష్కరించి త్వరలో అసంపూర్తి పనులు పూర్తి చేయాలి"

**నేటి సాక్షి గజ్వేల్ :** సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పట్టణ పరిధిలో గత ప్రభుత్వం రూ.223 కోట్లతో చేపట్టిన 23 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్ నిర్మాణ పనులు ఆరేళ్లుగా అసంపూర్తిగా నిలిచిపోయిన నేపథ్యంలో మెదక్ ఎంపీ రఘునందన్ రావు శుక్రవారం రింగ్ రోడ్ ప్రాంతాన్ని పరిశీలించారు. సంగాపూర్ పాలిటెక్నిక్ కళాశాల సమీపంలో భూ సేకరణ నష్టపరిహారం తగిన విధంగా ఇవ్వలేదని రైతు రామచంద్రం కోర్టును ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయని ఎంపీ తెలిపారు. రింగ్ రోడ్ నిర్మాణం పూర్తయితే గజ్వేల్ పట్టణంలో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గుతుందని, భారీ వాహనాలకు ప్రత్యామ్నాయ మార్గం అందుబాటులోకి వస్తుందని ఆయన పేర్కొన్నారు. గత పాలనలో భూ సేకరణ సమయంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం వల్ల రైతుకు సరైన న్యాయం జరగలేదని విమర్శించారు. భూ సేకరణ చట్టం ప్రకారం ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణాల కోసం భూమిని తీసుకునేటప్పుడు జీవో 123 ప్రకారం రైతులకు తగిన నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రెండు రోజుల్లో రైతు రామచంద్రంతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని, అవసరమైతే న్యాయపరంగా చర్యలు తీసుకుని భూ సేకరణ పూర్తి చేసి రింగ్ రోడ్ నిర్మాణాన్ని వేగంగా పూర్తిచేయాలని ప్రభుత్వాన్ని ఎంపీ కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, కౌన్సిలర్ రొట్టెల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మనోహర్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షుడు పంజాల అశోక్ గౌడ్, ఎల్ల బాబు, మంగళపల్లి సత్యనారాయణ, సింగం సత్తయ్య, సీనియర్ నాయకుడు నలగామ శ్రీనివాస్ తదితర బీజేపీ నేతలు పాల్గొన్నారు.

# సమతుల్య ఆహారంతో సర్వరోగ నివారణ

- అంగన్వాడి కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం
- మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్



**నేటి సాక్షి, కోరుట్ల (రాధారపు నర్సయ్య):** మహిళలు, గర్భిణీలు కిశోర బాలికలు చిన్నారులకు పోషకాలు ఉన్న సమతుల్య ఆహారం అందిస్తేనే భవిష్యత్తులో రోగాలు దరి చేరవని ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ 14వ వార్డు కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి తో కలసి అవగాహన కల్పించారు. పోషణ పక్వడ కార్యక్రమంలో భాగంగా శనివారం కోరుట్ల పట్టణ 14వ వార్డు భీమునిదుబ్బ అంగన్వాడి కేంద్రంలో పాలిచ్చే తల్లులకు శిశువుల పోషణ పై సంపూర్ణ ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళలకు పరిపూర్ణ అవగాహన కల్పించారు. పోషకాహారం వల్ల కలిగే ఆరోగ్యం గురించి క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్య పరుస్తున్నమన్నారు. అంగన్వాడి కేంద్రాల్లో పిల్లల ఎంతో బరువు చూసి ప్రత్యేక రిజిస్టర్ లో నమోదు చేసుకుని సప్లిమెంటరీ పోషకాహార నిపుణులు అవగాహన కిషోరా బాలికలకు రక్తహీనత పరీక్షలు జరుపి పోషకాహార ఆహారం అనుభవించడానికి పిల్లలు గర్భిణీలు బాలింతలు కౌమార దశలోని బాలికలు తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. అనంతరం మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ స్థానిక వార్డు కౌన్సిలర్ రేంజర్ల కళ్యాణి ల చేతుల మీదుగా భక్తుల భవిష్ కు అన్నప్రాసన చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ తిరుమల వసంత గంగాధర్ స్థానిక వార్డు కౌన్సిలర్ రెంజర్ల కళ్యాణి,సిడిపిఓ కే మణెమ్మ సూపర్వైజర్ ఏ భారతి, అంగన్వాడి టీచర్ ఆర్ రాజమణి, ఆర్ పి బి లక్ష్మి ,ఆశా జ్యోతి ఆయమ్మ పి కవిత మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

# జలగం సోమయ్య జీవితం ఆదర్శనీయం

మల్లు నాగార్జున రెడ్డి



**నేటి సాక్షి,మునగాల :** మునగాల మండల పరిధిలోని నేలమరి గ్రామంలో సీపీఎం నాయకుడు, మాజీ సర్పంచ్ జలగం సోమయ్య సంతాప సభ శనివారం బట్టుపల్లి ఉపేందర్ అధ్యక్షతన ఘనంగా జరిగింది. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి సోమయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారసత్వాన్ని పునికి పుచ్చుకుని, చివరి శ్వాస వరకు కమ్యూనిస్టుగా జీవించిన సోమయ్య జీవితం నేటి తరానికి ఆదర్శమని కొనియాడారు. మునగాల పరగణాలో దొరలు, భూస్వాములకు వ్యతిరేకంగా సాగిన పోరాటాల్లో నేలమరి గ్రామం చైతన్యవంతమైన పాత్ర పోషించిందని గుర్తు చేశారు. నిజాం రజాకార్లు, నెహ్రూ సైన్యాల కాల్పులకు బలై అమరుడైన యంగలి పాపయ్య వారసత్వంతో ఈ గ్రామంలో ఎందరో నాయకులు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడారని తెలిపారు. ఆ కోవకే చెందిన సోమయ్య 80 ఏళ్ల వయసులో గ్రామ సర్పంచ్ బాధ్యతలు చేపట్టి అభివృద్ధికి ఎంతో కృషి చేశారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, నాయకులు ములకలపల్లి రాములు, బుర్రి శ్రీరాములు, శ్రీకాంత్ వర్మ, స్వరాజ్యం, గోపయ్య, కృష్ణారెడ్డి, సుందరయ్య, కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

నేటి సాక్షి
TGTEL/25/A1737 | NETI SAKSHI
కరీంనగర్
ఆదివారం
1 2 ఏప్రియల్ 2026

# మత్తు పదార్థాల నిర్మూలనకు సమిష్టి కృషి అవసరం




- ఎస్పీ అశోక్ కుమార్, ఎమ్మెల్యే సంజయ్

**నేటి సాక్షి, జగిత్యాల (రాధారపు నర్సయ్య):** మత్తు పదార్థాల వ్యసనానికి గురైన వారిని సాధారణ జీవితంలోకి తీసుకురావడానికి సమాజం మొత్తం సమిష్టిగా కృషి చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా శనివారం వారు జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న డి-అడిక్షన్ సెంటర్‌ను సందర్శించి, బాధితులకు అందుతున్న చికిత్స విధానాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. డ్రగ్స్ సమస్య ఒక పెద్ద సామాజిక మరియు ఆరోగ్య సవాలని, దీన్ని అరికట్టేందుకు జిల్లాలో ప్రత్యేకంగా 'ఈగల్ టీం'ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ మాట్లాడుతూ యువత దేశానికి వెన్నెముక వంటివారని, చెడు అలవాట్లకు దూరంగా ఉండి తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రిలోని డి-అడిక్షన్ సెంటర్‌లో నిపుణులైన వైద్యులు ఉచితంగా చికిత్స మరియు మందులు అందిస్తున్నారని తెలిపారు. విద్యా సంస్థల్లో యాంటీ డ్రగ్స్ కమిటీలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, వైద్య సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# భారాసలోకి జీవన్ రెడ్డి..

## 20న జగిత్యాలలో భారీ బహిరంగ సభ



- కేసీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకోనున్న మాజీ మంత్రి
- జగిత్యాలలో రాజకీయ వేడి.. సభా స్థలాన్ని పరిశీలించిన ముఖ్య నేతలు

**నేటి సాక్షి,జగిత్యాల (రాధారపు నర్సయ్య):** జగిత్యాల జిల్లా రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకోబోతోంది. నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ఈ నెల 20న భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో చేరడం ఖాయమైంది. జగిత్యాలలోని మోతె రోడ్డులో నిర్వహించనున్న భారీ బహిరంగ సభలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సమక్షంలో ఆయన అధికారికంగా పార్టీలో చేరనున్నారు. ఆరు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అనుభవం ఉన్న జీవన్ రెడ్డి చేరికతో ఉత్తర తెలంగాణలో బీఆర్ఎస్ మరింత బలోపేతం కానుంది. ఇప్పటికే మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆంలతో భేటీ అయిన జీవన్ రెడ్డి, తెలంగాణ అభివృద్ధి మరియు రైతుల సంక్షేమం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ నేపథ్యంలో శనివారం జగిత్యాలలో నిర్వహించనున్న బహిరంగ సభ స్థలాన్ని మాజీ మంత్రి జీవన్ రెడ్డి, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ రావు, ఎమ్మెల్సీ ఎల్. రమణ, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ తదితరులు కలిసి పరిశీలించారు. జీవన్ రెడ్డి రాజీనామా కాంగ్రెస్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బగా మారనుండగా, జిల్లా వ్యాప్తంగా రాజకీయ సమీకరణాలపై తీవ్ర చర్చ జరుగుతోంది. సభను విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు భారీ స్థాయిలో ఏర్పాట్లు చేస్తున్నాయి.



# పూలే ఆశయాలను కొనసాగిద్దాం





**మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ నరసింహా గౌడ్**

**నేటి సాక్షి,నారాయణపేట(ఇమామ్ సాబ్):** స్థానిక అంబేద్కర్ భవనంలో శనివారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ సంఘం, పూలే సంఘం అధ్యక్షులు కురుమయ్య, జుట్ట శంకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పి. నరసింహా గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అంటరానితనం వేళ్లూనుకుపోయిన రోజుల్లోనే విద్యతోనే సామాజిక మార్పు సాధ్యమని నమ్మిన మహనీయుడు పూలే అని కొనియాడారు. తన భార్య సావిత్రిబాయి పూలేకు విద్య నేర్పించి మహిళా సాధికారతకు బాటలు వేశారని, స్త్రీ పురుష సమానత్వాన్ని చాటిచెప్పారని గుర్తు చేశారు. పూలే ఆశయాల వల్లే నేడు సామాన్యులకు విద్య, గౌరవం దక్కుతున్నాయని, బహుజన సమాజం ఆయన ఆలోచనా విధానాలను నిరంతరం ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మక్తల్ మున్సిపాలిటీ కోఆప్షన్ సభ్యుడు వల్లంపల్లి లక్ష్మణ్, ప్రజా సంఘాల నాయకులు నరసింహ, రాములు, హనుమంతు, రాము, ఉస్మాన్ పాల్గొన్నారు. అదేవిధంగా నారాయణపేట జిల్లాలోని జాజాపూర్ ఉన్నత పాఠశాలలో కూడా పూలే జయంతి వేడుకలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు.

# కరాటే బెల్ట్ పరీక్షల పేరుతో వసూళ్లు



- ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలి
- విద్యార్థుల నుండి రూ. 1000 వసూలు చేయడంపై ఎన్ఎస్‌యూఐ ఆగ్రహం
- జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నాయకుడు అన్వర్ సదాత్

**నేటి సాక్షి, నారాయణపేట (ఇమామ్ సాబ్):** మరికల్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో కరాటే బెల్ట్ పరీక్షల పేరుతో విద్యార్థుల నుండి వెయ్యి రూపాయలు వసూలు చేసిన ప్రిన్సిపాల్ నాగమణి మలపై కఠిన చర్యలు తీసుకోవాలని నారాయణపేట జిల్లా ఎన్ఎస్‌యూఐ (NSUI) నాయకులు అన్వర్ సదాత్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు ఆత్మరక్షణ కోసం ప్రభుత్వం కరాటే శిక్షణను ప్రవేశపెట్టిందని, ఇందుకోసం మాస్టర్లకు మూడు నెలల శిక్షణకు గాను రూ. 15,000 ప్రభుత్వం చెల్లిస్తుందని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం ఉచితంగా శిక్షణ ఇస్తుంటే, మరికల్ గురుకుల పాఠశాలలో బెల్ట్ ఎగ్జామ్ నెపంతో ప్రతి విద్యార్థి నుండి రూ. 1000 వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఇటువంటి అక్రమ వసూళ్లు జరగలేదని, ప్రస్తుత ప్రిన్సిపాల్ తీరు వల్లే విద్యార్థులు ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపించారు. జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి విచారణ జరిపించాలని కోరారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకోని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో భారీ ఎత్తున ఆందోళనలు చేపడతామని అన్వర్ సదాత్ హెచ్చరించారు.

# ఘనంగా పూలే జయంతి వేడుకలు


**ప్రజా సంఘాలు**



**నేటి సాక్షి, పాములపాడు:** మహాత్మా జ్యోతిరావు పూలే 200 జయంతి సందర్భంగా పాములపాడులో ఘనంగా వేడుకలు నిర్వహించారు, ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు ఘన నివాళులు అర్పించారు, కార్యక్రమంలో పలువురు నాయకులు మాట్లాడుతూ 1827లో మహాత్మా జ్యోతిరావు పూలే మహారాష్ట్రలోని మాలి బీసీ కులంలో జన్మించిన పూలే విద్య ద్వారా సమాజ శ్రేయస్సు సాధ్యమని నమ్మారు చిన్ననాటి నుంచి విద్యాభ్యాసం కొనసాగించి స్కాటిష్ హై స్కూల్లో చదువుకున్నారు , విద్యార్థి దశలోనే మానవ హక్కుల పై ప్రభావితమై సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా పోరాటం ప్రారంభించారు 1848లో జరిగిన ఒక సంఘటన ఆయనను మరింతగా చైతన్యవంతుడిని చేసింది , అదే సంవత్సరం దళిత బాలికల కోసం మొదటిసారిగా పాఠశాలను ప్రారంభించారు తన భార్య సావిత్రిబాయి పూలేను టీచర్గా నియమించి దళిత బాలికలకు విద్యను ప్రారంభించారు బాలికల విద్య వితంతువు పునర్వివాహం అనాథలకు ఆశ్రయం వంటి అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు, 1855లో రాత్రి పాఠశాలలు ప్రారంభించడం ఆయన మరో గొప్ప కృషి గా నిలిచింది 1872లో సత్యశోధక సమాజాన్ని స్థాపించి కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగించారు రైతులు కూలీల హక్కుల కోసం కూడా ఉద్యమించి బ్రిటిష్ ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు, 1887లో ఆయనకు మహాత్మా అనే బిరుదును ప్రధానం చేయబడింది ఆయన మరణించినప్పటికీ ఆయన ఆలోచనలు సమాజానికి మార్గదర్శకునిగా నిలిచాయి, ఈ సందర్భంగా దాసరి రామచంద్రయ్యకు మహాత్మా జ్యోతిరావు పూలే సేవారత్న అవార్డును జాతీయ బీసీల కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవరాయుడు అందజేశారు, కార్యక్రమంలో డాక్టర్ నాగన్న, గోపాల్, మురళి, అబ్రహం, అంకన్న, రాము, శ్రీకాంత్ స్వాములు, సురేంద్ర,శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు

**వికారాబాద్ జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా.**



**నేటి సాక్షి వికారాబాద్ :** ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించేందుకు తెలంగాణ పోలీసులు "ఇంటి వద్దే ఎఫ్ఐఆర్ నమోదు" విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ శ్రీమతి స్నేహ మెహ్రా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విధానం ద్వారా బాధితులు పోలీస్ స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేకుండా, ఫోన్ ద్వారా సమాచారం అందించిన వెంటనే పోలీసులు బాధితుల నివాసానికి లేదా వారికి అనుకూలమైన ప్రదేశానికి వెళ్లి ఫిర్యాదును స్వీకరిస్తారు. ఫిర్యాదు రాయలేని పరిస్థితుల్లో పోలీసులే బాధితుడి వాంగ్మూలాన్ని వారి భాషలో నమోదు చేసి, చదివి వినిపించి సంతకం తీసుకొని అక్కడికక్కడే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, ప్రతిని అందజేస్తారు. ప్రత్యేకంగా మహిళలు, పిల్లలు మరియు బలహీన వర్గాల వారికి ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. లైంగిక నేరాలు, హత్యాయత్నం, గాయపరిచే ఘటనలు, దొంగతనం, దోపిడీ, చోరీ వంటి ఆస్తి సంబంధిత నేరాలు, పోక్సో కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు, బాల్య వివాహ నిరోధక చట్టాలకు సంబంధించిన కేసుల్లో ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. మహిళలు, పిల్లల కేసుల్లో మహిళా పోలీసు అధికారిని తప్పనిసరిగా పంపిస్తారు. అవసరమైతే ప్రత్యేక అధికారి, ఉపాధ్యాయుల సమక్షంలో వాంగ్మూలం నమోదు చేస్తారు. పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి, సాక్ష్యాలను సేకరించే చర్యలు వెంటనే ప్రారంభిస్తారు. ఈ విధానం వల్ల ఫిర్యాదు నమోదు ప్రక్రియ వేగవంతమవుతుంది, ఆలస్యం తగ్గుతుంది, అలాగే బాధితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లే ఇబ్బంది తగ్గుతుంది. ప్రజలు ఈ సదుపాయాన్ని వినియోగించుకొని నేరాలను నిర్భయంగా ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ కోరారు. జిల్లా పోలీసులు ప్రజల భద్రతకు కట్టుబడి పనిచేస్తున్నారని తెలిపారు.

# డాక్టర్ పైడి అంకయ్యకు అంతర్జాతీయ గౌరవం




**నేటి సాక్షి,చౌడేపల్లి:** సమాజ సేవా రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వే ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పైడి అంకయ్యకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ప్రపంచ బుక్ ఆఫ్ ఎక్సలెన్స్ రికార్డ్ సంస్థ వారు ఆయనకు ప్రతిష్టాత్మకమైన 'సర్టిఫికేట్ ఆఫ్ ఎక్సలెన్స్' పురస్కారాన్ని అందజేశారు. సమాజ సేవలో అసాధారణ ప్రతిభ, అంకితభావం మరియు నిబద్ధతతో ఆయన చేసిన ప్రభావవంతమైన సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు. ముఖ్యంగా విద్యా, సాంస్కృతిక రంగాల్లో వే ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పలు సేవా కార్యక్రమాలు విశేషంగా నిలిచాయి. జాతీయ స్థాయిలో ఇప్పటికే అనేక ప్రశంసలు అందుకున్న డాక్టర్ అంకయ్యకు, ఇప్పుడు అంతర్జాతీయ స్థాయిలో ఈ గౌరవం దక్కడం పట్ల హర్షం వ్యక్తం అవుతోంది. ఆయన చేపడుతున్న సామాజిక కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పలువురు కొనియాడారు. ఈ సందర్భంగా ప్రముఖులు, స్నేహితులు మరియు శ్రేయోభిలాషులు డాక్టర్ పైడి అంకయ్యకు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

# శాంసన్ సెంచరీ.. చెన్నై సూపర్ విక్టరీ



## ఢిల్లీ క్యాపిటల్స్ పై 23 పరుగుల తేడాతో ఘన విజయం
## బౌలింగ్ లో అదరగొట్టిన జెమీ ఓవర్టన్, అన్షుల్ కాంబోజ్

**చెన్నై, ఏప్రిల్ 11:** ఐపీఎల్ లో భాగంగా చెన్నైలోని చిదంబరం స్టేడియంలో శనివారం జరిగిన మ్యాచ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ పై చెన్నై సూపర్ కింగ్స్ 23 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించింది. సంజు శాంసన్ అద్భుత సెంచరీతో చెలరేగగా.. బౌలర్లు సమిష్టిగా రాణించి జట్టుకు విజయాన్ని అందించారు. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత ఇరవై ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీ స్కోరు సాధించింది. లక్ష్య ఛేదనలో ఢిల్లీ నిర్ణీత ఓవర్లలో 189 పరుగులకే పరిమితమై పరాజయాన్ని మూటగట్టుకుంది.

### ఆకాశమే హద్దుగా శాంసన్

టాస్ గెలిచిన ఢిల్లీ ముందుగా బౌలింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్ కు దిగిన చెన్నై బ్యాటర్లు ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించారు. ముఖ్యంగా సంజు శాంసన్ ఆకాశమే హద్దుగా చెలరేగాడు. కేవలం 56 బంతుల్లోనే 115 పరుగులతో అజేయంగా నిలిచి జట్టుకు భారీ స్కోరును అందించాడు. అతడికి తోడుగా ఆయుష్ మ్హాత్రే 36 బంతుల్లో 59 పరుగులు చేసి అద్భుత సహకారం అందించాడు. చివర్లో శివమ్ దూబే పది బంతుల్లో 20 పరుగులతో అజేయంగా నిలిచాడు. ఢిల్లీ బౌలర్లలో అక్షర్ పటేల్ కు ఒక వికెట్ దక్కింది. మిగతా బౌలర్లు చెన్నై బ్యాటర్ల దాటికి తేలిపోయారు.

### తడబడిన ఢిల్లీ బ్యాటర్లు

213 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ ఏ దశలోనూ విజయ తీరాల వైపు పయనించలేదు. ట్రిస్టన్ స్టబ్స్ 38 బంతుల్లో 60 పరుగులు, పాతుమ్ నిస్సాంక 24 బంతుల్లో 41 పరుగులు చేసి ఒంటరి పోరాటం చేసినా లాభం దక్కలేదు. చివర్లో అశుతోష్ శర్మ పది బంతుల్లో 19 పరుగులతో మెరిశాడు. చెన్నై బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ కు ఢిల్లీ బ్యాటర్లు చేతులెత్తేశారు. చెన్నై బౌలర్లలో జెమీ ఓవర్టన్ కేవలం 18 పరుగులిచ్చి నాలుగు వికెట్లు పడగొట్టి ఢిల్లీ పతనాన్ని శాసించాడు. అన్షుల్ కాంబోజ్ మూడు వికెట్లు తీయగా.. నూర్ అహ్మద్ ఒక వికెట్ దక్కించుకున్నాడు.






# బౌలర్ల ఘోర వైఫల్యం.. సన్‌రైజర్స్ పరాజయం

## 219 పరుగులు చేసినా కాపాడుకోలేని దైన్యం
## పంజాబ్ చేతిలో ఆరు వికెట్ల తేడాతో చిత్తు



**చండీగఢ్, ఏప్రిల్ 11:** పీసీఏ న్యూ క్రికెట్ స్టేడియంలో శనివారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు చెత్త బౌలింగ్ తో చేజేతులా ఓటమిని కొనితెచ్చుకుంది. బ్యాటర్లు భారీ స్కోరు అందించినా.. బౌలర్లు ఏమాత్రం ప్రభావం చూపలేక చతికిలబడ్డారు. ఫలితంగా 220 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ కేవలం 18.5 ఓవర్లలోనే నాలుగు వికెట్లు కోల్పోయి సునాయాసంగా ఛేదించింది. పంజాబ్ బ్యాటర్ల ధాటికి సన్‌రైజర్స్ బౌలింగ్ లోపాలు, మైదానంలో పక్కా వ్యూహం లేమి స్పష్టంగా బయటపడ్డాయి.

### వృథా అయిన అభిషేక్ శ్రమ

అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన హైదరాబాద్ నిర్ణీత ఇరవై ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 219 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఓపెనర్ అభిషేక్ శర్మ (28 బంతుల్లో 74) క్రీజులో విధ్వంసం సృష్టించగా.. ట్రావిస్ హెడ్ (23 బంతుల్లో 38), హెన్రిచ్ క్లాసెన్ (33 బంతుల్లో 39) రాణించారు. పంజాబ్ బౌలర్లలో శశాంక్ సింగ్, అర్ష్‌దీప్ సింగ్ తలో రెండు వికెట్లు పడగొట్టారు. బ్యాటర్లు తమ బాధ్యతను అద్భుతంగా నెరవేర్చినా, ఆ స్కోరును కాపాడుకోవడంలో హైదరాబాద్ బౌలర్లు దారుణంగా విఫలమయ్యారు. సరైన లైన్, లెంగ్త్ లేకుండా బంతులు వేస్తూ పంజాబ్ బ్యాటర్లకు ధారాళంగా పరుగులు సమర్పించుకున్నారు.

### పంజాబ్ బ్యాటర్ల ఊచకోత

భారీ లక్ష్య ఛేదనలో పంజాబ్ బ్యాటర్లు హైదరాబాద్ బౌలర్లపై ఎక్కడా కనికరం చూపలేదు. ప్రియాన్ష్ ఆర్య (20 బంతుల్లో 57), ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (25 బంతుల్లో 51) అర్ధశతకాలతో చెలరేగడంతో పవర్ ప్లేలోనే సన్‌రైజర్స్ బౌలర్లు చేతులెత్తేసినట్లు కనిపించింది. భాగస్వామ్యాలను విడదీయడంలో కెప్టెన్ వ్యూహాలు ఏమాత్రం పనిచేయలేదు. శివాంగ్ కుమార్ మూడు వికెట్లు, హర్ష్ దూబే ఒక వికెట్ తీసినా అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఆ తర్వాత క్రీజులోకి వచ్చిన శ్రేయస్ అయ్యర్ (33 బంతుల్లో 69 నాటౌట్) ఆకాశమే హద్దుగా చెలరేగుతూ సన్‌రైజర్స్ బౌలింగ్‌ను చీల్చిచెండాడాడు. చెత్త బౌలింగ్, పేలవమైన ఫీల్డింగ్ కారణంగా హైదరాబాద్ ఏడు బంతులు మిగిలి ఉ ండగానే పరాజయాన్ని మూటగట్టుకుంది. పంజాబ్ విజయంలో కీలక పాత్ర పోషించిన శ్రేయస్ అయ్యర్‌కు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.





## ప్యారడైజ్ నుంచి కాయడు లోహర్ లుక్ విడుదల

నేచురల్ స్టార్ నాని, దర్శకుడు శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'ది ప్యారడైజ్' నుంచి ఒక క్రేజీ అప్‌డేట్ వచ్చింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న కాయడు లోహర్ పుట్టినరోజు సందర్భంగా చిత్ర బృందం ఆమెకు శుభాకాంక్షలు తెలుపుతూ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. ఈ పోస్టర్‌లో కాయడు రెట్రో లుక్‌లో అలరిస్తుంది. ఇక 'దసరా' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత నాని శ్రీకాంత్ ఓదెల కాంబినేషన్‌లో వస్తున్న రెండో సినిమా కావడంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా.. ÷ూఒ÷ఎ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ బ్జడెట్‌తో నిర్మిస్తున్నారు. సికింద్రాబాద్ స్లమ్ ఏరియా నేపథ్యంలో పీరియడ్ యాక్షన్ డ్రామాగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇందులో నాని 'జడల్' అనే ఊర మాస్ పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రం ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సినిమాలో మోహన్ బాబు, రాఘవ్ జుయల్, సోనాలి కులకర్ణి వంటి ప్రముఖ నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన 'రా స్టేట్‌మెంట్' గ్లింప్స్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది.

# నెట్‌ఫ్లిక్స్‌లోకి ఉస్తాద్ భగత్ సింగ్

పవన్ కల్యాణ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీశ్ శంకర్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఓటీటీ విడుదల తేదీని ఫిక్స్ చేసుకుంది. ఏప్రిల్ 16 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. గతంలో దీనికి సంబంధించి ఎన్నో వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటికి చెక్ పెడుతూ తాజాగా నెట్‌ఫ్లిక్స్ దీనిపై అధికారిక ప్రకటన విడుదల చేసింది. దేవిశ్రీ ప్రసాద్, తమన్ సంగీతం అందించిన ఈ సినిమాలో పవన్‌కు జోడీగా రాశీఖన్నా, శ్రీలీల నటించారు. నల్లమలకు సమీపంలో ఓ గూడెం అది. అక్కడికి పాఠాలు బోధించేందుకు చంద్రశేఖర్ రావు (కె.ఎస్.రవికుమార్) అనే మాస్టారు వస్తారు. అక్కడి జనం కోసం తన జీతాన్ని, జీవితాన్ని అంకితం చేస్తాడు. కూలి పనులకు వెళ్లే పిల్లలు మళ్లీ చదువుల కోసం బడి బాట పట్టేలా చేస్తారు. ఆ ఊళ్లోనే పుట్టి పెరిగి అనాథగా ఉన్న చిన్నయ్యని చేరదీసి అతనికి సంరక్షకుడిగా మారి చదువు చెప్పిస్తాడు. ఆ కుర్రాడి భావాలు, అతనిలోని ఆవేశం గ్రహించి భగత్‌సింగ్ అని పేరు పెడతాడు. తన తండ్రిని ఉస్తాద్ అని పిలిచేవారని తన పూర్తి పేరును ఉస్తాద్ భగత్‌సింగ్ అని చెప్పుకొంటాడు ఆ కుర్రాడు. ఆ తర్వాత సేవాగుణం ఉన్న మాస్టారు రాజకీయాల్లోకి అడుగుపెట్టి ముఖ్యమంత్రి అవుతారు. చిన్నప్పటి ఉస్తాద్ భగత్‌సింగ్ పెద్దయ్యాక ఏసీపీ (పవన్‌కల్యాణ్) అవుతాడు. ముఖ్యమంత్రి అయిన తన గురువుకు ఎప్పుడూ రక్షణగా ఉంటుంటాడు. అయితే అసాంఘిక శక్తులతో సంబంధాలున్న చెదలమర్రి నల్లనాగప్ప (పార్తిబన్) ముఖ్యమంత్రి పీఠంపై కన్నేస్తాడు. చంద్రశేఖర్‌రావుని అంతం చేయాలని పథకం రచిస్తాడు. మరి నల్లనాగప్పని ఏసీపీ ఉస్తాద్ భగత్‌సింగ్ ఎలా ఎదుర్కొన్నాడు? ఉస్తాద్ జీవితంలోకి వచ్చిన లీల (శ్రీలీల), శ్లోక (రాశీఖన్నా) ఎవరు అన్నది చిత్ర కథ.






## ఓటీటీలోకి యూత్

తమిళంలో ఘనవిజయం సాధించి, తెలుగులోనూ మంచి ఆదరణ పొందిన లేటెస్ట్ రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'యూత్' ఇప్పుడు డిజిటల్ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ నెట్‌ఫ్లిక్స్ ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను సొంతం చేసుకోగా ఈ చిత్రం ఏప్రిల్ 16, 2026 నుంచి స్ట్రీమింగ్ కానుంది. కెన్ కరుణాస్ ఈ చిత్రంలో కథనాయకుడిగా నటించడంతో పాటు దర్శకత్వం వహించగా.. అనీషా అనిల్ కుమార్, మీనాక్షి దినేష్, ప్రియాన్షీ యాదవ్, సూరజ్ వెంజరమూడు, దేవదర్శిని తదితరులు కీలక పాత్రల్లో నటించారు. మార్చి 19న తమిళంలో, మార్చి 27న తెలుగులో థియేటర్లలో విడుదలై బాక్సాఫీస్ వద్ద మంచి వసూళ్లను సాధించింది ఈ చిత్రం. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. ఒక మధ్యతరగతి టీనేజర్ తన స్కూల్, కాలేజ్ రోజుల్లో ప్రేమ కోసం చేసే ప్రయత్నాలు, ఎదుర్కొన్న అవమానాలు, బ్రేకప్స్ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఒక యువకుడు తన జీవిత ప్రయాణంలో ఎదురైన అనుభవాల నుండి ఎలా పరిణతి చెందాడు అనే అంశాన్ని దర్శకుడు వినోదాత్మకంగా, భావోద్వేగపూరితంగా తెరకెక్కించారు.




## తమ్ముడు టైటిల్ కోసం నాగార్జున పెద్దమనసు

సినీ పరిశ్రమలో సినిమా టైటిల్స్ మారడం, ఒకరి దగ్గరున్న టైటిల్ మరొకరు తీసుకోవడం చాలా సాధారణ విషయం. ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ అయిన టైటిల్‌ను అవసరమైతే రిక్వెస్ట్ ద్వారా లేదా పరస్పర అంగీకారంతో మార్పిడి చేసుకోవడం తరచూ జరుగుతూనే ఉంటుంది. అలాంటి అరుదైన, ఆసక్తికర సంఘటనల్లో ఒకటి పవన్ కళ్యాణ్ మరియు నాగార్జున మధ్య జరిగిన 'తమ్ముడు' టైటిల్ వ్యవహారం. 'తొలిప్రేమ' భారీ విజయంతో పవన్ కళ్యాణ్ కెరీర్ ఒక్కసారిగా టాప్ గేర్‌లోకి వెళ్లింది. ఆ వెంటనే దర్శకుడు అరుణ్ ప్రసాద్ తో కలిసి ఆయన చేసిన సినిమా 'తమ్ముడు'. ఈ చిత్రం విడుదలై బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచి, పవన్‌ను యూత్ ఐకాన్‌గా మరింత బలపరిచింది. ముఖ్యంగా పాటలు, స్టైల్, యాక్షన్, కామెడీ అన్నీ కలిసి ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, 'తమ్ముడు' అనే టైటిల్ మొదట నాగార్జున వద్దే ఉంది. ఆయన, హరికృష్ణ కలిసి అన్నదమ్ముల అనుబంధం నేపథ్యంలో ఒక సినిమా చేయాలని ప్లాన్ చేశారు. ఆ కథకు 'తమ్ముడు' అనే టైటిల్‌ను నిర్ణయించి ఫిలిం ఛాంబర్‌లో రిజిస్టర్ కూడా చేయించారు. ఈ సమయంలో పవన్ కళ్యాణ్ సినిమా కోసం నిర్మాత శివ రామకృష్ణ ఆ టైటిల్‌ను నాగార్జునను అభ్యర్థించగా, ఆయన సానుకూలంగా స్పందించి 'తమ్ముడు' టైటిల్‌ను ఇచ్చేశారు. తరువాత నాగార్జున తన సినిమాకు 'సీతారామరాజు' అనే టైటిల్ పెట్టుకున్నారు. ఆ చిత్రం కూడా మంచి విజయాన్ని సాధించింది. ఇదే సమయంలో పవన్ నటించిన 'తమ్ముడు' కూడా భారీ హిట్ అయింది. ఇది టాలీవుడ్‌లోని సానుకూల వాతావరణాన్ని, కళాకారుల మధ్య ఉన్న పరస్పర గౌరవాన్ని ప్రతిబింబిస్తుంది.




## స్వయంభు టీజర్‌కు భారీ స్పందన

టాలీవుడ్ యంగ్ హీరో నిఖిల్ సిద్దార్థ్ కెరీర్‌లోనే అత్యంత భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న పీరియడ్ యాక్షన్ డ్రామా 'స్వయంభూ'. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రాగా, ఇప్పుడు ఈ చిత్రం మ్యూజికల్ ప్రయాణాన్ని ప్రారంభించేందుకు సిద్ధమైంది. ఈ సినిమాలోని మొదటి పాట 'రా రా ధీవర' ఏప్రిల్ 16న విడుదల కాబోతున్నట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఒక యోధుడి స్ఫూర్తిని చాటిచెప్పే విధంగా సాగే ఈ గీతం ప్రేక్షకులను ఆకట్టుకోనుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో పిక్సెల్ స్టూడియోస్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో నిఖిల్ సరసన సంయుక్త మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. కేజీఎఫ్ ఫేమ్ రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. ఈ వేసవిలో 'స్వయంభూ' వెండితెరపై భారీ స్థాయిలో సందడి చేయనుంది.



## ఉజ్జయిని మహాకాళేశ్వరుడిని దర్శించుకున్న సారా అర్జున్

బాలీవుడ్ నటి, 'ధురంధర్' ఫేమ్ సారా అర్జున్ శనివారం మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని శ్రీ మహాకాళేశ్వరుడిని దర్శించుకున్నారు. ఉదయం ఉజ్జయిని మహాకాళేశ్వరుడి ఆలయానికి చేరుకున్న ఆమెకి ఆలయ సిబ్బంది ఘనస్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఇక సారా మహాకాళేశ్వరుడిని దర్శించుకోవడంతో పాటు స్వామివారికి అత్యంత ప్రీతిపాత్రమైన భస్మ హారతి సేవలో పాల్గొంది. ఈ పవిత్ర ఆధ్యాత్మిక యాత్ర ముగించుకున్న అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ.. తనకు మాటలు రావడం లేదని, స్వామివారి పిలుపు రావడం వల్లే తాను ఇక్కడికి రాగలిగానని తెలిపారు. ప్రపంచంలో దీనిని మించిన గొప్ప అనుభూతి మరొకటి లేదని, ఈ పర్యటన తనకు ఎంతో సంతోషాన్ని ఇచ్చిందని ఆమె భావోద్వేగానికి లోనయ్యారు. కాగా ఇందుకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం వైరల్‌గా మారాయి.



Printed, Published and Owned by **SHAIK FAREED,** and Printed at Sunday Printing Press, 3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR, ANDHRA PRADESH - 522006. and Published from 6-1-303, SIDDIPET, TELANGANA - 505528, Telangana State. Editor: **SHAIK FAREED.** RNI NO : **TGTEL/25/A1737** Email: netisakshinews@gmail.com. Phone No: **9119949944, 9666052221**

TGTEL/25/A1737 | NETI SAKSHI

# పూలే ఆశయాలు ప్రతి ఒక్కరికీ మార్గదర్శకం

## సామాజిక విప్లవ సూర్యుడు

మహాత్మా జ్యోతిరావు పూలే...



**నేటి సాక్షి,పుంగనూరు:** పట్టణంలోని ఇందిరా సర్కిల్‌లో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించి, అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం పోరాడి అణగారిన వర్గాలకు ఆశాజ్యోతిగా, అక్షర యోధుడిగా నిలిచిన వ్యక్తి పూలే అని కొనియాడారు. మహిళా విద్యకు నాంది పలికిన ప్రథమ యోధుడని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ అహర్నిశలు పాటుపడాలని పిలుపునిచ్చారు. సమాజంలోని మూఢనమ్మకాలను నిర్మూలించాలంటే విద్య ఒక్కటే మార్గమని, చదువుతోనే సమూల మార్పులు సాధ్యమని పూలే గట్టిగా నమ్మారని వారు గుర్తు చేశారు. వితంతువులకు ఆశ్రయం కల్పించడం, సంఘ సంస్కరణలు చేపట్టడం వంటి కార్యక్రమాల ద్వారా ఆయన సమసమాజ స్థాపనకు కృషి చేశారన్నారు. విద్య లేనివాడు వివేకాన్ని, తద్వారా ప్రగతిని కోల్పోతాడని సమాజానికి చాటిచెప్పిన మహోన్నత వ్యక్తి పూలే అని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ డీఎస్పీ సుకుమార్, బీజేపీ నాయకులు మదన్ మోహన్, మల్లికారాణి, బహుజన హక్కుల సాధన సమితి అధ్యక్షురాలు ప్రతిభ, గంగరాజు, విజయ ప్రతాప్, శ్రీనివాసులు, సుమిత్ర రమణ, కుమార్, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.


## పూలే సేవలు చిరస్మరణీయం

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్.



**నేటి సాక్షి వికారాబాద్ :** వికారాబాద్ జిల్లా కోట్ పల్లి మండల పరిధిలో నీ భర్వాద్ గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బర్వాద్ గ్రామంలో గల ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి, నివాళులు అర్పించిన వికారాబాద్ జిల్లా దీ=వా పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం దళిత, బహుజన జనోద్ధరణ కోసం, వర్ణ వివక్షకు వ్యతిరేకంగా వివక్ష లేని సమానత్వ సమాజం కోసం జీవితకాలం పోరాడిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు. నేడు ఆ మహనీయుని జయంతి సందర్భంగా ఆయన చేసిన సేవలు స్మరించుకుంటూ... వారి బాటలో నడుద్దాం అని కోరారు. ఈ కార్యక్రమంలో మండల BRS పార్టీ నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## వాంకిడిలో పూలే జయంతి



**నేటి సాక్షి, వాంకిడి (ఎండి ముబీన్):** కొమురం భీమ్ జిల్లా వాంకిడి మండలంలో మహాత్మా జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఉపాధ్యక్షులు గురునులే నారాయణ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి అయిన మహాత్మా జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పిలుపునిచ్చారు. సమాజంలోని అణగారిన వర్గాల అభివృద్ధి కోసం, విద్య కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాలీ సంఘం నాయకులు మరియు వివిధ బడుగు బలహీన వర్గాల సంఘాల నాయకులు పాల్గొని పూలే ఆశయ సాధనకు కట్టుబడి ఉంటామని ప్రకటించారు. కార్యక్రమంలో వాంకిడి గ్రామ సర్పంచ్, జూనియర్ కాలేజ్ సతీష్, మండల అధ్యక్షులు వాడే బాబురావు, ముర్కర అశోక్, ఆర్య సంఘం జిల్లా అధ్యక్షులు మెట్పల్లి జయరాం, మాజీ సింగిల్ విండో చైర్మన్ జాబ్ రే ప్రింట్, ఇతర ప్రజాప్రతినిధులు, మాలీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

- గజ్వేల్‌లో పూలే జయంతి వేడుకల్లో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్




**నేటి సాక్షి గజ్వేల్:** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, సామాజిక తత్వవేత్త, మహిళా విద్యాభివృద్ధికి మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని గజ్వేల్ పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సామాజిక పరివర్తన ప్రచారోద్యమంలో భాగంగా డీబీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి. శంకర్ మహాత్మా పూలే చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పి. శంకర్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావు పూలే సంఘ సంస్కర్తగా, కుల వివక్షపై పోరాడిన యోధుడిగా, అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. వందల ఏళ్ల క్రితమే అట్టడుగు వర్గాల సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చి, వారి అభివృద్ధి కోసం సామాజిక ఉద్యమాన్ని నిర్మించిన మహనీయుడు పూలే అని పేర్కొన్నారు. సమాజంలో వేళ్లూనుకున్న అసమానతలను ప్రశ్నిస్తూ విద్య ద్వారానే విముక్తి సాధ్యమని నమ్మిన గొప్ప సంస్కర్త పూలే అని అన్నారు. మహిళా విద్యాభివృద్ధికి, అట్టడుగు వర్గాల సంక్షేమానికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని తెలిపారు. పూలే ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని అమలు చేస్తూ ప్రతి ఒక్కరికీ విద్య, ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా ముందుకు సాగాలని సూచించారు. మహాత్మా పూలే అడుగుజాడల్లో నడుస్తూ సమసమాజ స్థాపన కోసం అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి, మండల అధ్యక్షులు సింగాటం చంద్రం, మహేందర్, తాడేం కృష్ణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జ్యోతి రావు పూలే 199 వ జయంతి వేడుకలు




- పూలే ఆశయాలను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలి. ఎమ్మెల్యే. గిత్త జయసూర్య

**నేటి సాక్షి, నందికొట్కూరు:** నందికొట్కూరు నియోజకవర్గం నందికొట్కూరు కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈరోజు నేడు మహాత్మ జ్యోతిబాపూలే గారి జయంతి సందర్భంగా నందికొట్కూరు శాసనసభ్యులు శ్రీ గిత్త జయసూర్య, నందికొట్కూరు పట్టణంలో జ్యోతి రావు పూలే గారి విగ్రహానికి పూల మాల వేసి ఘన నివాళులర్పించారు సందర్భంగా ఎమ్మెల్యే గిత్త జయసూర్య మాట్లాడుతూ: సత్యశోధక సంఘాన్ని స్థాపించి,సామాజిక సమరసత కోసం పాటుపడిన వైతాళికుడు,కుల వ్యవస్థలోని అంతరాలను రూపుమాపేందుకు అహర్నిశలు కృషిచేసిన జ్ఞాన పథికుడు. విద్య ద్వారానే విముక్తి లభిస్తుందని నమ్మి, సమాజంలో పేరుకుపోయిన అసమానతలపై రాజీలేని పోరాటం చేసిన ధన్యజీవి మహాత్మ జ్యోతిబాపూలే గారు. ముఖ్యంగా మహిళా విద్య కోసం, సామాజిక న్యాయం కోసం ఆయన వేసిన పునాదులు నేటికీ మనందరికీ మార్గదర్శకాలు. ఆయన ఆశయ సాధనలో భాగస్వాములవుతూ, వివక్ష లేని సమాజ నిర్మాణం కోసం పునరంకితమవ్వడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవం, మహాత్మ జ్యోతిబాపూలే గారి జయంతి సందర్భంగా ఆ మహానీయుడికి నమస్సుమాంజలులు అర్పిస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో: మండల కన్వీనర్ మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, ఖాతా రమేష్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, జాకీర్ హుస్సేన్, షకీల్ అహ్మద్ లాయర్ జాకీర్, జమీల్, మూర్తి జావలి, క్లస్టర్ ఇంచార్జ్ మద్దిలేటి, పాణ్యం వేణుగోపాల్, ఆర్ట్ శీను, ధర్మారెడ్డి, గిరి, శ్రీకాంత్ గౌడ్, ఎళయ ఆచారి, నిమ్మకాయల రాజు, నిమ్మకాల మోహన్, కళాఖర్, చాంద్బాషా, భరత్, లింగమయ్య, సర్వోత్తమ్ రెడ్డి, రజిని కుమార్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మహిళ నాయకురాలు, మీనాక్షి దేవి, వనజ, అనురాధ, పట్టణ నాయకులు కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలు



- మహిళా విద్య, సామాజిక సమానత్వం కోసం పోరాడిన యోధుడు పూలే:
- జాతీయ బీసీ సంక్షేమ సంఘం, ప్రజా సంఘాల నాయకులు



**నేటి సాక్షి ,పాములపాడు:** పాములపాడు మహిళా విద్య, సామాజిక సమానత్వం కోసం పోరాడిన యోధుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని జాతీయ బీసీ సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆర్ఎస్ఆర్.గోపాల్, సామాజికవేత్త డాక్టర్ డి.నాగన్న, బీసీ జాతీయ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల సంజీవరాయుడు లు తెలిపారు. నంద్యాల జిల్లా, మండల కేంద్రమైన పాములపాడులో జాతీయ బీసీ సంక్షేమ సంఘం వారి ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 200వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు మహాత్మ జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించి, ఆయన నినాదాలు తెలుపుకుంటూ పూలే ఆశయాలను ప్రజా సంఘాల నాయకులు, వివిధ పార్టీ నాయకులు, ప్రజలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా జాయింట్ సెక్రెటరీ ఆర్ఎస్ఆర్. గోపాల్ మాట్లాడుతూ విద్య పట్ల పూలే దార్శనికత మనందరికీ స్ఫూర్తిదాయకం. మహాత్మా పూలే తన విజ్ఞానంతో, వివేకంతో... వ్యవసాయం, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి వంటి రంగాలపై విస్తృత అవగాహనను పెంపొందించుకున్నారు. రైతులు, కార్మికులకు అన్యాయం జరిగితే మన సమాజం బలహీనపడుతుందని ఆయనెప్పుడూ చెప్పేవారు. పొలాల నుంచి పల్లెల దాకా.. రోజువారీ జీవితంలో సామాజిక అసమానతల తీవ్రతను ఆయన నిశితంగా గమనించారు. అందుకే పేదలు, అణగారిన వర్గాల ఆత్మ గౌరవాన్ని కాపాడడంలో ఆయన పూర్తిగా నిమగ్న మయ్యారు. అలాగే సామాజిక సామరస్యం కోసం శక్తి వంచన లేకుండా నిర్విరామంగా కృషి చేశారనీ తెలిపారు. ఈ సందర్భంగా సామాజికవేత్త డాక్టర్ డి.నాగన్న, జాతీయ బిసి సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ బత్తుల.సంజీవ రాయుడు లు మాట్లాడుతూ" సమాజం ఆధునిక భారతదేశంలో అత్యంత ముఖ్యమైన సామాజిక సంస్కరణ ఉద్యమాల్లో ఒకటి. సామాజిక సంస్కరణ, సమాజ సేవ, మానవ గౌరవాన్ని పెంపొందించడంలో ఇది అగ్రగామిగా నిలిచింది. మహిళలు, యువత, గ్రామీణ ప్రజలకు గొంతుకైంది. న్యాయం, ప్రతి వ్యక్తికీ గౌరవం, సమష్టి పురోగతి స్ఫూర్తిని కేంద్రంగా నిలపడం ద్వారా.. సమాజాన్ని శక్తిమంతంగా తీర్చిదిద్దవచ్చన్న మహాత్మా పూలే విశ్వాసానికి ఈ ఉద్యమం నిదర్శనం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్ రామ్మోహన్, శంకర్ , జాల.సురేష్, వేణు ప్రజాసంఘాల నాయకులు డివిఎంసి మెంబర్ లింగాల.స్వాములు, ఎమ్మార్పీఎస్ నాయకులు కోట.ప్రభాకర్, నాగరాజు, మాల మహానాడు రాయలసీమ అధ్యక్షుడు కలబండి.అంకన్న, సోషల్ వర్కర్ కలబండి.నాగరాజు, బానకచర్ల ఉపసర్పంచ్ నరసింహులు గౌడు, బోధితత్వ గిరి, అబ్రహం, సిపిఎం పార్టీ నాయకులు మేకల.రాజు, దేవ భక్తుడు, సొసైటీ చైర్మన్ రాయపాటి గోవిందు, సోడా బాష, సోషల్ మీడియా ప్రతినిధులు దక్క.శ్రీకాంత్, జే.పీ.ఇస్మాయిల్, చంద్రుడు, సుధాకర్, నాగలింగమయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## పూలే చేసిన కృషి చిరస్మరణీయం



**నేటి సాక్షిమంచిర్యాల :** సామాజిక న్యాయం, విద్యా విస్తరణ మరియు సమానత్వం కోసం మహాత్మ జ్యోతిరావు పూలే చేసిన కృషి చిరస్మరణీయమని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య కొనియాడారు. పూలే జయంతిని పురస్కరించుకుని శనివారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ దర్నె మధుకర్, డిప్యూటీ మేయర్ సల్లా రమ్య, ఇతర అధికారులతో కలిసి అదనపు కలెక్టర్ పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. పేదలు, మహిళలు మరియు వెనుకబడిన వర్గాల అభ్యున్నతి కోసం పూలే అందించిన సేవలు నేటికీ స్ఫూర్తిదాయకమని తెలిపారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకుని సమాజంలో సమానత్వం మరియు అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉపసంచాలకులు చాతరాజుల దుర్గాప్రసాద్, జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ, వివిధ శాఖల అధికారులు, బీసీ సంఘాల ప్రతినిధులు, వసతి గృహ సంక్షేమ అధికారులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# గంజాయి ముఠా గుట్టురట్టు



నేటి సాక్షి,మదనపల్లె: మదనపల్లె పరిసర ప్రాంతాల్లో గంజాయి సరఫరా చేస్తున్న ముఠా గుట్టును తాలూకా పోలీసులు రట్టు చేశారు. ఉల్లిపాయల లోడ్ కింద గంజాయి తరలిస్తున్న పాత కేసులో పరారీలో ఉన్న నలుగురు నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి లక్ష రూపాయల విలువైన 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి మీడియా సమావేశంలో వెల్లడించారు.

- నలుగురు నిందితుల అరెస్ట్

జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి ఆదేశాల మేరకు, తాలూకా సీఐ కళా వెంకటరమణ తన సిబ్బందితో కలిసి బసినికొండ సమీపంలోని కనుమలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో బస్సు దిగి అనుమానాస్పదంగా కవర్లతో పారిపోతున్న ఇద్దరు పురుషులు, ఇద్దరు మహిళలను చాకచక్యంగా అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారు గతంలో నమోదైన 179 కేజీల గంజాయి స్మగ్లింగ్ కేసులో పరారీలో ఉన్న మల్లెల మహేష్, మల్లెల అమరావతి, మల్లెల రాజమ్మ, మల్లెల చంటిగా గుర్తించారు. నిందితుల నుంచి గంజాయి స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి సాగు, రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని, యువతను మత్తుకు బానిసలుగా మార్చే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగిస్తామని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రజలు పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. నిందితులను పట్టుకున్న తాలూకా పోలీసు సిబ్బందిని ఈ సందర్భంగా ఆయన అభినందించారు.

# రాజ్యాంగాన్ని కాపాడుకుంటేనే హక్కులకు రక్షణ



నేటి సాక్షి,మంచిర్యాల(శ్రీధర దమ్ము): సీఐటీయూ (CITU) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సామాజిక న్యాయ వారోత్సవాల సందర్భంగా శనివారం పట్టణంలోని పూలే భవనంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అధ్యక్షతన 'రాజ్యాంగ పరిరక్షణ సవాళ్లు' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక, ఉద్యోగ సంఘాల జిల్లా కన్వీనర్ రంగు రాజేశం, డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. కుల వివక్షకు వ్యతిరేకంగా, స్త్రీ విద్య కోసం అణగారిన వర్గాల అభ్యున్నతికి పూలే చేసిన కృషిని కొనియాడారు. నేడు కేంద్రంలోని పాలకులు రాజ్యాంగంపై ప్రమాణం చేసి, దానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. ఎనిమిది గంటల పని విధానం, కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కార్మికులను బానిసలుగా మారుస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతూ, సామాజిక సంఘాలపై దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడం ద్వారానే కార్మికుల, ఉద్యోగుల హక్కులకు రక్షణ ఉంటుందని స్పష్టం చేశారు. పూలే ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సంకె రవి, సహాయ కార్యదర్శులు దూలం శ్రీనివాస్, సాంబారి వెంకటస్వామి, నాయకులు పద్మావతి, స్వాతి, ప్రకాష్, సాగర్ రెడ్డి, ప్రేమ్ కుమార్, దుర్గం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక విప్లవ పితామహుడు జ్యోతిరావు పూలే

- హాజరైన మాజీ సర్పంచ్ పగిడిపెల్లి వెంకటేశ్వర్లు



నేటిసాక్షి,ములుగు: తెలంగాణ అంబేద్కర్ సంఘం మంగపేట మండల అధ్యక్షులు యెంపెల్లి వీరస్వామి ఆధ్వర్యంలో దళిత, బడుగు, బలహీన వర్గాల విద్యా ప్రధాత జ్యోతిరావు పూలె 199 వ జయంతి కార్యక్రమాన్ని మండల కేంద్రం అంబేద్కర్ సెంటర్ లో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన అంబేద్కర్ సంఘం మండల వ్యవస్థాపకులు పగిడిపల్లి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ కోట్లాది మంది సామాన్యుల జీవితాల్లో ఆత్మగౌరవ దీపాన్ని వెలిగించిన అసలైన చరిత్రకారుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని కొనియాడారు పూలే ఆలోచనలు తర్వాత కాలంలో డా బిఆర్ అంబేద్కర్ కు స్ఫూర్తి ని నింపాయని, అంబేద్కర్ తన గురువుగా పూలే ను స్వీకరించారని, నేడు మనం అనుభవిస్తున్న స్వేచ్ఛ కు విద్యా హక్కుకు పునాది వేసిన జ్యోతిరావు పూలే మహనీయుని ప్రస్థానం అద్వితీయం. సమాజ మార్పుకు విద్యే మూలమణి నమ్మిన పూలే బాలికల కోసం పాఠశాల ను స్థాపించి తన భార్య సావిత్రి బాయి పూలే ను విద్యా వంతురాలిని చేసి మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయరాలుగా చేసిన ఘనత జ్యోతిరావు పూలేది. మతం పేరుతో సాగుతున్న దోపిడీని అరికట్టెందుకు సత్యశోదక్ సమాజం స్థాపించి ప్రాథ్యామ్నాయ సాంసృతి కీ మార్గం చూపెట్టాడు అని జ్యోతిరావు పూలే, మార్గన్ని ఆశయాలను కొనసాగించాలని పగిడిపల్లి వెంకటేశ్వర్లు తెలియజేశాడు ఈ కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం మంగపేట మండల ప్రధాన కార్యదర్శి బోడ రామచంద్రయ్య గుళ్లగట్టు విజయరావు ఎల్పి రవి దాసరి ఎల్లయ్య, గాజర్ల రాజు దాసరి బుజ్జి యెంపెల్లి మల్లేష్ లక్ష్మణ్ ధర్మారపు సాయిలు యామిని పాల్గొన్నారు.

# జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు



నేటి సాక్షి, జగిత్యాల (గుండ ప్రశాంత్ గౌడ్): వెలివాడలకు అక్షర దారులు వేసిన క్రాంతి దర్శి, సామాజిక విముక్తి దేశంలో నిజమైన మహాత్ముడు, సామాజిక విప్లవకారుడు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా శనివారం రోజున జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండల కేంద్రములో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు కోమల్ల జలంధర్ ఆధ్వర్యంలో జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోమల్ల జలంధర్ మాట్లాడుతూ సమాజశీలో అత్యధిక శాతంగా ఉన్న బలహీన వర్గాలు ఉన్నతంగా ఎదగాలని, సామాజిక, ఆర్థిక అసమానతలు ఉండకుండా అందరు చదువుకొని జ్ఞానవంతులుకావాలని అందుకోసం జీవితాంతం కృషి చేసిన మహనీయుడు, మహాత్మాజ్యోతిబాపూలే ఈసందర్భంగా తెలిపారు. తెలంగాణ రాష్ట్రంఏర్పాటు లో విద్యార్థులు, నిరుద్యోగులు తమ ప్రాణాలు సైతం లెక్కచేయకుండా పోరాటం చెయ్యడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి గ్రామ సర్పంచ్ నల్ల నీరజ సతీష్ రెడ్డి ఉపసర్పంచ్ గురజాల బుచ్చిరెడ్డి వార్డ్ మెంబర్ ఇతరవేణి మధు వార్డు మెంబర్ కళ్యాణ్ ఎమార్పిఎస్ జిల్లా అధ్యక్షులు గంగాధర నరేష్ రజక సంఘం అధ్యక్షులు కలకోట సత్యం గంగాధర మధుసూదన్ సందవేణి సతీష్ చాడ నాగరాజ్ కత్తెర్ల హరీష్ చెవులమద్ది గంగాధర్ ముదిరాజ్ సంఘ సభ్యులు ఇతరవేణి రాకేష్ బోండ్ల జలంధర్ బసవేణి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టులో జ్యోతిబాపూలే జయంతి



నేటి సాక్షి,కోరుట్ల (రాధారపు నర్సయ్య): కోరుట్ల కోర్టు ప్రాంగణంలో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబా పూలే జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి న్యాయవాదులు ఘన నివాళులర్పించారు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ తోట ఆంజనేయులు మాట్లాడుతూ.. స్త్రీ విద్యాభివృద్ధి, అణగారిన వర్గాల విద్యా విస్తరణ మరియు అంటరానితనం నిర్మూలన కోసం పూలే దంపతులు చేసిన కృషి చిరస్మరణీయమని కొనియాడారు. జనరల్ సెక్రటరీ సుతారి శ్రీనివాస్ మాట్లాడుతూ మహిళా సాధికారత లేకుండా దేశ అభివృద్ధి అసాధ్యమని భావించిన పూలే, అప్పట్లోనే మహిళా విద్యకు తొలి అడుగులు వేశారని గుర్తు చేశారు. అనంతరం సీనియర్ న్యాయవాది కొంపల్లి సురేష్ మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు అండగా నిలిచి అనాధ శిశువులకు ఆశ్రయం కల్పించడం, వితంతు పునర్వివాహాలను ప్రోత్సహించడం వంటి సేవలు పూలే గొప్పతనాన్ని చాటుతున్నాయని అన్నారు. చింత నారాయణ సూర్యప్రసాద్ మాట్లాడుతూ సమానత్వం, విద్యా విస్తరణే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పూలే ఆశయాలను ఆచరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బార్ వైస్ ప్రెసిడెంట్ అంబల్ల నాగ నిర్మల, క్యాషియర్ చింతకింది ప్రేమ్, జాయింట్ సెక్రటరీ కడకుంట్ల దినేష్‌తో పాటు పలువురు సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

# కొండాపూర్‌లో పూలే జయంతి



నేటి సాక్షి, గన్నేరువరం(బుర్ర అంజయ్య గౌడ్): మండలంలోని గునుకుల కొండాపూర్ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి ఉత్సవాలను శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సొల్లు అజయ్ వర్మ తన పాలకవర్గంతో కలిసి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలను ఎదిరించి, బానిస సంకెళ్లను చదువుతోనే తెంచుకోవచ్చని నిరూపించిన మహోన్నత వ్యక్తి పూలే అని కొనియాడారు. స్త్రీలకు మరియు శూద్రులకు విద్యను అందించేందుకు తన జీవితాన్ని అంకితం చేసిన సంఘసంస్కర్త అని, శూద్రుల ఆత్మగౌరవాన్ని చాటిచెప్పిన మహానుభావుడని పేర్కొన్నారు. సమాజం కోసం తన చివరి శ్వాస వరకు పోరాడిన నిజమైన మహాత్ముడు జ్యోతిరావు పూలే అని, ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు మరియు మోకు దెబ్బ రాష్ట్ర అధికార ప్రతినిధి జాగిరి శ్రీనివాస్ గౌడ్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ యాదగిరి, వార్డు సభ్యులు పరశురాం గౌడ్, లక్ష్మయ్య, సంపత్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అలాగే ఎంఆర్పీఎస్ నాయకులు దేవరాజ్, గణేష్, లక్ష్మణ్, చంద్రయ్య, ఆగ్రోస్ నిర్వాహకులు లక్ష్మణ్ గౌడ్, గ్రామ పెద్దలు సత్తయ్య, తిరుపతి మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# జ్యోతిరావు పూలే జయంతి

**మంత్రాలయం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ బొగ్గుల తిక్కన్న**



నేటి సాక్షి : మంత్రాలయం మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా మంత్రాలయం మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ బొగ్గుల తిక్కన్న కార్తికేయ ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూలే భారతదేశంలో సామాజిక మార్పుకు పునాది వేసిన మహానుభావుడని, మహిళల విద్య, దళితుల హక్కులు, సమానత్వ భావన బలపడటానికి ఆయన చేసిన కృషి అపారమని తెలిపారు. MGNREGS సిబ్బంది ఎం. రామన్న, జె. హనుమంతు ఆధ్వర్యంలో ఉపాధి కూలీలతో కలిసి పని ప్రదేశంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. మహిళా విద్యకు శ్రీకారం చుట్టి, సావిత్రిబాయి పూలేతో కలిసి దేశంలో తొలి బాలికల పాఠశాలలను స్థాపించడం ఆయన దూరదృష్టికి నిదర్శనమని పేర్కొన్నారు. కుల వివక్ష నిర్మూలన కోసం సత్యశోధక్ సమాజ్ ద్వారా సమానత్వం, న్యాయం కోసం పూలే చేసిన కృషి చిరస్మరణీయమని అన్నారు. పేదలు, దళితులు, మహిళల అభ్యున్నతికి ఆయన చేసిన సేవలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ పూలే ఆశయాలను ఆచరణలో పెట్టాలని, విద్య, సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గంలో నడవాలని పిలుపునిచ్చారు

# అంబేద్కర్ విగ్రహావిష్కరణ ఓ చరిత్ర





**నేటి సాక్షిజగదేవపూర్:** దేశంలో పాలకులు ప్రజాస్వామ్యాన్ని హరిస్తున్నారని, అణగారిన వర్గాలకు స్వేచ్ఛ లేకుండా పోతోందని అరుణోదయ విమలక్క ఆవేదన వ్యక్తం చేశారు. సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండలం తిమ్మాపూర్‌లో డా. బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం శుక్రవారం రాత్రి ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి బిఆర్ఎస్ గజ్వేల్ ఇన్చార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి, అరుణోదయ విమలక్క, తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్, దరువు ఎల్లన్న ముఖ్య అతిథులుగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విమలక్క మాట్లాడుతూ.. దేశంలో కుల, మత వ్యవస్థల వల్ల బడుగు బలహీన వర్గాలు ఇబ్బందులు

- **ప్రజాస్వామ్యాన్ని హరిస్తున్న దేశ పాలకులు**
- **అంబేద్కర్ వాదాన్ని దళిత బహుజనులు అందిపుచ్చుకోవాలి**
- **ఓటును నోటుకు అమ్ముకోవద్దు: క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్**

పడుతున్నారని, అణగారిన వర్గాల చైతన్యంతోనే బహుజన రాజ్యం సాధ్యమని పేర్కొన్నారు. వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పేద ప్రజల పక్షాన పోరాడుతున్నానని, అంబేద్కర్ ఆశయ సాధనే తన లక్ష్యమని తెలిపారు. తనను అసెంబ్లీకి పంపిస్తే పేదలకు మరింత న్యాయం చేస్తానని కోరారు. తెలంగాణ క్రాంతి దళ్ అధ్యక్షుడు పృథ్వీరాజ్ యాదవ్ మాట్లాడుతూ.. గ్రామం నడిబొడ్డున బొడ్రాయి ఎదుట అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్టించడం రాష్ట్రంలోనే ఒక చరిత్ర అని కొనియాడారు. దళిత బహుజనులు తమ ఓటును నోటుకు అమ్ముకోవద్దని పిలుపునిచ్చారు. గాయకుడు దరువు ఎల్లన్న తన ఆటపాటలతో ప్రజల్లో చైతన్యం నింపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఉపసర్పంచ్ నాగరాజు, నాయకులు కొట్టాల యాదగిరి, శ్రీనివాస్ గౌడ్, ఎల్లేష్, ఓంప్రకాష్, పద్మారావు, అంబేద్కర్ ఉత్సవ కమిటీ సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# అత్తను కరెంట్ షాక్‌తో చంపాలని చూసిన అల్లుడు అరెస్ట్




**నేటి సాక్షి, జగిత్యాల (గుండ ప్రశాంత్ గౌడ్):** భార్యను కాపురానికి పంపడం లేదనే కక్షతో అత్తను విద్యుత్ షాక్‌తో చంపడానికి ప్రయత్నించిన అల్లుడిని వెల్గటూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఎస్సై పి. ఉదయ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జగదేవపేట గ్రామానికి చెందిన గాగిరెడ్డి మల్లారెడ్డికి, పద్మతో 25 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. గత కొంతకాలంగా మల్లారెడ్డి వేధింపులు భరించలేక పద్మ తన పిల్లలతో కలిసి తల్లి గడ్డం రాజవ్వ ఇంటికి వెళ్లిపోయింది. అక్కడ కూడా మల్లారెడ్డి వేధింపులు కొనసాగడంతో భయపడిన పద్మ, రెండు నెలల క్రితం గొల్లపల్లిలోని మేనమామ ఇంటికి వెళ్లి తలదాచుకుంది. తన అత్త రాజవ్వ వల్లే భార్య రావడం లేదని భావించిన మల్లారెడ్డి, ఆమెను చంపేందుకు పథకం పన్నాడు. ఈ నెల 10వ తేదీ రాత్రి రాజవ్వ నివాసం ఉంటున్న ఇంటి ప్రధాన ద్వారం వద్ద రెండు ఇనుప రాడ్లను అమర్చి, వాటికి విద్యుత్ తీగలు తగిలించి నేరుగా కరెంట్ పోల్ నుండి కనెక్షన్ ఇచ్చాడు. మరుసటి రోజు ఉదయం రాజవ్వ తలుపులు తీసి బయటకు రాగానే విద్యుత్ షాక్ తగిలింది. వెంటనే ఆమె అప్రమత్తమై కేకలు వేయడంతో స్థానికులు వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేసి ప్రాణాపాయం తప్పించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు వెల్గటూర్ పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడు మల్లారెడ్డిని అరెస్ట్ చేశారు. నిందితుడిని మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వివరించారు.

# పూలే ఆశయాలను నిజం చేస్తున్న ప్రభుత్వం





**నేటి సాక్షి :** మంత్రాలయం మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జ్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం అదృష్టంగా భావిస్తున్నామని టీడీపీ ఇన్‌చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పూలే గారు కుల వివక్షను ఎదుర్కొని మహిళల విద్యకు పునాది వేసిన గొప్ప సంస్కర్త అని కొనియాడారు. సమాన హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు. పూలే ఆశయాలను కొనసాగిస్తూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం బడుగు, బలహీన

- **టిడిపి ఇన్‌చార్జ్ రాఘవేంద్ర రెడ్డి**

వర్గాల అభివృద్ధికి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని తెలిపారు. మహిళల సాధికారతతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు విద్య, ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సమాన సమాజ నిర్మాణానికి కట్టుబడి ఉందని అన్నారు. బీసీ వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పేర్కొంటూ, భారీ స్థాయిలో నిధుల కేటాయింపు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, కుల గణన, ఉపాధి-నైపుణ్యాభివృద్ధి పథకాలు, విద్యార్థులకు సదుపాయాలు వంటి చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఆదరణ 3.0 వంటి పథకాల ద్వారా స్వయం ఉపాధికి ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. అయితే గత వైసీపీ ప్రభుత్వ పాలనలో బడుగు వర్గాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయని విమర్శించారు. దాడులు పెరగడం, మహిళల రక్షణలో వైఫల్యం, ఆర్థిక సహాయాల లోపం వంటి అంశాలు ప్రజలకు నష్టం కలిగించాయని ఆరోపించారు. ఈ పరిస్థితులు పూలే ఆశయాలకు విరుద్ధమని పేర్కొన్నారు.


పూలే గారి ఆశయాలను నిజంగా గౌరవించాలంటే సమానత్వం, న్యాయం, బడుగు వర్గాల అభివృద్ధి కోసం అందరూ కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# రేపాలలో పూలే జయంతి



**నేటి సాక్షి,మునగాల :** మునగాల మండల పరిధిలోని రేపాల గ్రామపంచాయతీ కార్యాలయంలో మహాత్మా జ్యోతిరావు పూలే 199వ జయంతి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల సైదులు ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి సర్పంచ్ మొగిలిచర్ల సత్యనారాయణ, పశువైద్యాధికారి మమత ముఖ్య అతిథులుగా హాజరై పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అణగారిన వర్గాల హక్కుల కోసం, మహిళా విద్యాభివృద్ధి కోసం పూలే చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ఆయన చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా మానవత్వాన్ని చాటుకుంటూ స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని రోగులకు పండ్లను పంపిణీ చేశారు. అలాగే గ్రామంలో నిరంతరం సేవలందిస్తున్న పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. పూలే ఆశయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు మరియు స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మందలించిందని తల్లిని చంపిన కన్నకొడుకు



**నేటి సాక్షి,మల్లాపూర్ :** మల్లాపూర్ మండల కేంద్రంలో దారుణ ఘటన చోటుచేసుకుంది. భార్యతో గొడవ పడుతుండగా వారించినందుకు కన్నతల్లిని ఓ కుమారుడు హతమార్చాడు. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కడుదుల నంబయ్య తరచూ తన భార్య లక్ష్మితో గొడవ పడేవాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి కూడా దంపతుల మధ్య ఘర్షణ జరుగుతుండగా, తల్లి కడుదుల వెంకు (80) వారిని మందలించింది. దీంతో ఆగ్రహానికి లోనైన నంబయ్య తల్లి ముఖంపై బలంగా గుద్ది, మంచం మీద నుండి కిందకు పడేశాడు. తీవ్ర గాయాలైన వృద్ధురాలు అక్కడికక్కడే మృతి చెందింది. నంబయ్య తన తల్లిని పోషించడాన్ని భారంగా భావిస్తూ తరచూ గొడవలు పడేవాడని స్థానికులు తెలిపారు. సమాచారం అందుకున్న మల్లాపూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. నిందితుడు నంబయ్యను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. వృద్ధాప్యంలో కంటికి రెప్పలా కాపాడాల్సిన కొడుకే కాలయముడిలా మారి తల్లిని చంపడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఈ ఘటనతో మండల కేంద్రంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## పెద్దకడబూరులో పూలే జయంతి



**నేటి సాక్షి :** పెద్దకడబూరు మహాత్మ జ్యోతిరావు పూలే 199వ జయంతి సందర్భంగా పెద్దకడబూరు ఎస్సీ కాలనీలో వీ౹ాూ మండల అధ్యక్షుడు ఎం.పీ. యువరాజ్ మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా యువరాజ్ మాదిగ మాట్లాడుతూ, సమాజంలో సగభాగమైన మహిళలు అభివృద్ధి చెందకపోతే దేశానికి పురోగతి అసాధ్యమని విశ్వసించిన మహాత్మా జ్యోతిరావు పూలే మహిళా విద్యకు తొలి జ్యోతి వెలిగించారని తెలిపారు. తన సతీమణి సావిత్రిబాయి పూలేను పాఠశాలకు పంపి సమాజానికి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. అనాథ శిశువులకు ఆశ్రయం కల్పించడం, వితంతువుల పునర్వివాహానికి మద్దతు ఇవ్వడం, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేయడం ద్వారా పూలే మహానుభావుడిగా నిలిచారని అన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీ౹ాూ నాయకులు మంచోది నాగరాజు, జగతప్ప, దేవసహాయం, మంచోది రాజకుమార్, బొగ్గుల రాజు, మంచోది దావీదు, చిన్న తుంబలం తిక్కన్న, కరువ బజార్ తదితరులు పాల్గొన్నారు.

## మిత్రుని జ్ఞాపకార్థం

**పాఠశాలకు వాటర్ ప్యూరిఫైయర్ విరాళం**



**నేటి సాక్షి,జగిత్యాల(గుండ ప్రశాంత్ గౌడ్):** మరణించినా తన స్నేహితుల గుండెల్లో, వారు చేసే సేవా కార్యక్రమాల్లో జీవించే ఉంటారని గొల్లపల్లి మండలం రాఘవపట్నం గ్రామానికి చెందిన చాణక్య హైస్కూల్ 2017-18 పదవ తరగతి మిత్రులు నిరూపించారు. అకాల మరణం చెందిన తమ ప్రియతమ మిత్రుడు లేట్ గరిగంటి అనిల్ జ్ఞాపకార్థం శనివారం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల కోసం ఆ బ్యాచ్ మిత్రులందరూ కలిసి వాటర్ ప్యూరిఫైయర్‌ను విరాళంగా అందజేశారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన సర్పంచ్ కాసరపు భవాని అరవింద్ మాట్లాడుతూ.. స్నేహితుడిపై ఉన్న మమకారాన్ని పదిమందికి ఉపయోగపడేలా సేవా కార్యక్రమంగా మార్చడం అభినందనీయమని కొనియాడారు. స్వచ్ఛమైన తాగునీరు అందించడం ద్వారా అనిల్ పేరు చిరస్థాయిగా నిలిచిపోతుందని పేర్కొన్నారు. తమ మిత్రుడు భౌతికంగా దూరమైనా, ఇలాంటి కార్యక్రమాల ద్వారా ఎప్పుడూ తమతోనే ఉంటాడని 2017-18 బ్యాచ్ మిత్రులు ఈ సందర్భంగా భావోద్వేగంతో తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకళ, సుమిత్ర, ఉపాధ్యాయ బృందం, గరిగంటి తిరుపతి కుటుంబ సభ్యులు, ఉప సర్పంచ్ సిరవేణి రవి, మాజీ సర్పంచ్ బుర్ర తిరుపతి, రాజిరెడ్డి, అంజయ్య, బ్యాచ్ మిత్రులు మరియు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

## దారిచూపిన దర్శనికుడు పూలే

**సర్పంచ్ రజిత పరశురామ్**



**నేటిసాక్షి, జగదేవపూర్ :** సమాజంలో సగభాగమైన స్త్రీలు అభివృద్ధి చెందకపోతే దేశానికి పురోగతి అసాధ్యమని విశ్వసించిన జ్యోతిరావ్ పూలే నాడే మహిళా విద్యకు తొలి జ్యోతి వెలిగించారని సర్పంచ్ రజిత పరశురామ్ అన్నారు మహాత్మ జ్యోతిబాపూలే నూట తొంబై తొమ్మిది జయంతి సందర్భంగా జగదేవపూర్ మండలం తిగుల్ గ్రామంలో అంబేద్కర్ చౌరస్తా వద్ద జ్యోతిబాపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన సతీమణి సావిత్రిబాయి పూలేని పాఠశాలకు పంపి సమాజానికి ఆదర్శంగా నిలిచారని తెలిపారు. అనాథ శిశువులకు ఆశ్రయం కల్పించి, వితంతువుల పునర్వివాహానికి మద్దతుగా, బడుగు, బలహీనవర్గాలకు వెన్నుదన్నుగా నిలిచిన పూలే ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. నేటి యువత జ్యోతిబాపూలేని ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధి కోసం పాటుపడాలని కోరారు కార్యక్రమంలో ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనసూయ ఉపాధ్యాయులు సత్తయ్య వివిధ పార్టీల నాయకులు సుధాకర్ రెడ్డి, భూమయ్య, ఎల్లారెడ్డి, కర్ణాకర్ రెడ్డి, మహేందర్ రెడ్డి, బిక్షపతి, దయానంద రెడ్డి, మహేష్, ఈశ్వర్, కనకయ్య, జర్నలిస్ట్ నరేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

## చిలుకూరులో పూలే జయంతి



**నేటి సాక్షి, చిలుకూరు:** సూర్యాపేట జిల్లా చిలుకూరు మండల కేంద్రం లో దొడ్డ నరసయ్య భవన్లో మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు బీసీ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, అంటరానితనాన్ని రూపుమాపడానికి కృషి చేసిన సామాజిక సంస్కర్త, మహిళా విద్యాభివృద్ధికి మార్గదర్శి, నిత్య స్ఫూర్తిప్రదాత,వివక్ష లేని సమానత్వ సమాజం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప సామాజిక తత్వవేత్త. మహాత్మా జ్యోతిరావు పూలే అని కొనియాడారు ఈ కార్యక్రమంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వెంకటరమణ చారి,జిల్లా ఉపాధ్యక్షుడు నిగిడాల లింగయ్య, విశ్రాంత ప్రొఫెసర్ పుట్టపాక అంజయ్య, సీపీఐ జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యులు సాయిబెల్లి ,మల్లెపంగు అశోక్,sk కాశిం తదితరులు పాల్గొన్నారు.

TGTEL/25/A1737 | NETI SAKSHI

# డాక్టర్ 'శృంగార పురుష్'!

## ఇది మెట్‌పల్లిలో ఓ 'సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్' వైద్యుడి 'దేహశుద్ధి' కథ





**అదే హాస్పిటల్‌లో పని చేసే ఓ 'నర్స్'తో కామక్రీడ**

**'భార్యకు రెడ్ హ్యాండెడ్'గా వైద్యుడి దొరికాడట**

**ఆ-ఇద్దరినీ భార్యే చితకబాదినట్టు గుసగుస**

**గతంలో పలుమార్లు భార్యకే పట్టుబడి 'దేహశుద్ధి'కి గురైనట్టు చిలువలు - పలువలు**

**భార్యకు 'సంతానయోగం' లేదని.. విభేదాలతోనే 'డాక్టర్ గారి చిలక్కొట్టుల్లంట'!**

**3-4 రోజులుగా 'ఓపీ-బంద్' చేయడంతో అసలు విషయం బయటకు..**

"ఆయన.. గంగాదేవిని తలపై మోసేంత బరువైన పేరున్న 'మహాదేవ్'డంతటి 'డాక్టర్.. శృంగార పురుష్'డు.! కానీ.. తన 'చిలక్కొట్టుడు'తో ఇంటావిడ 'పార్వతిదేవి'చే తరచూ 'దేహశుద్ధి' చేయించుకుంటూ 'పాప ప్రక్షాళన' కావించబడతాడని బయట 'హాట్ టాపిక్కు'.! మెట్‌పల్లి పట్టణంలో వైద్యం పేరుతో నమ్మకం అమ్ముకుంటూ.. డబ్బు.. విలాసాల మత్తులో నైతికతను మరచిపోయిన ఆ వైద్యుడి వ్యవహారం ఇప్పుడు పెద్ద కలకలంగా మారింది. ప్రాణాలు కాపాడాల్సిన వైద్య వృత్తి పట్ల విశ్వాసం పెంచాల్సిన వ్యక్తి, అక్రమ సంబంధాల లోతుల్లో పడిపోవడం ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. అదే ఆసుపత్రిలో పనిచేసే నర్స్‌తో అనుచిత 'సం-బంధం' పెట్టుకుని భార్య చేతికి 'రెడ్ హ్యాండెడ్'గా చిక్కడం, దేహశుద్ధికి గురవ్వడం, అయినా మారని వైఖరి ప్రదర్శించడం ఇవన్నీ కలసి వైద్య నైతికతకు మచ్చగా మారాయి. ఇప్పటికే పలుమార్లు ఇదే తరహా ఘటనలు జరిగినట్లు వినిపిస్తుండగా, ఆసుపత్రి ఓపీని కొన్ని రోజులుగా మూసివేయడం వెనుక అసలు నిజాలు బయటపడుతున్నాయన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలు తమ ఆరోగ్యం, ప్రాణాలను నమ్ముకుని అప్పగించే సంస్థలో ఇలాంటి ఘటనలు వెలుగులోకి రావడం, ఆ హాస్పిటల్ యాజమాన్యం డబ్బు కోసం అన్నీ 'ప్యాకేజీ'గా ముసుగు కప్పుకుని కొనసాగిస్తోందన్న ఆరోపణలు మరింత తీవ్రతరమవుతున్నాయి. వైద్యం.. నమ్మకం..నైతికత అనే విలువలు ఒక్కొక్కటిగా కూలిపోతున్న ఈ పరిణామం, చివరికి జనాల అవస్థలకే కారణమవుతుందా.?అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.!"

- నేటి సాక్షి, మెట్‌పల్లి (రాధారపు నర్సయ్య)

## ఇంతకీ.. జరిగిందేమిటాంటే.!

అది.. జగిత్యాల జిల్లాలోని మెట్‌పల్లి పట్టణంలోని 'సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్'.అందులో ప్రముఖ డాక్టర్ స్వతహాగా 'శృంగార పురుష్'డంట.! గత కొన్నేళ్లుగా ఆయన తన వెంట నిత్యం తిరిగే 'అందమైన కుందనాల బొమ్మ' వంటి ..'నర్స్'తో శారీరక 'సం-బంధం' పెట్టుకుని సతీమణి రుసరుసలపై ప్రతీకారం తీర్చుకుంటూ ఆమె ఒడిలో 'సేదదీరుతుంటాడని' హాస్పిటల్ బయట టాకు.! ఇదంతా గుట్టుచప్పుడు కాకుండా డాక్టరయ్య వీలైనంత వరకు ఎంజాయ్ చేస్తున్నాడని పసిగట్టిన 'పార్వతీదేవి'..ఓ శుభముహూర్తాన 'గంగమ్మ'తో రిలాక్స్ అవుతుండగా 'రెడ్ హ్యాండెడ్'గా పట్టేసుకుందని పట్టణంలో ప్రచారం జరుగుతోంది.వెంటనే ఆమె పట్టరాని కోపంతో 'ఆ-ఇద్దరి'ని 'సం-స్కార'వంతమైన సోప్ తో ఉతికి ఆరేసిందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.ఇదంతా .. కొందరు 'ఔట్ పేషెంట్'లు..వారి 'అటెండెంట్లు' ..'నిఘా నేత్రాలు'.. చూస్తుండగానే జరిగిందని చెవులు కొరుక్కుంటున్నారు.!

## 'సంతాన లక్ష్మీ' కోసమే ఈ 'సం-బంధాలంట'.?

'పార్వతీదేవి'కి దురదృష్టవశాత్తు సంతాన యోగం లేదని తెలుసుకున్న మన 'శృంగార పురుష్'డు..ఏ పుట్టలో ఏ పాముందో.? తాను కొట్టే 'చిలక్కొట్టుడు'లో ఎవరైనా తనకు 'సంతానప్రాప్తి' కల్పించకపోతరాని డాక్టరయ్య తాపత్రయమంట మరి.! అదేదో వాళ్లే చెబుతారుగా.. 'సంతాన యోగం' లేని దంపతులకు 'టెస్ట్ ట్యూబ్-బేబీ' అని..'సరోగసీ' అనీ..ఇలా రక రకాల సంతాన మార్గాలు చూపుతారు. ఇవేవీ కాకపోతే చివరాఖరి అవకాశంగా 'దత్తత' తీసుకోమని కౌన్సిలింగ్ కూడా ఇస్తారు.! ఇవేవీ పాటించకుండా మన డాక్టరయ్య 'రెడ్ హ్యాండెడ్'గా దొరికిపోయిన ప్రతీసారి తన 'శృంగార లీలల' నుంచి తప్పించుకు నేందుకు 'సంతాన లక్ష్మీ' కథ చెబుతుంటాడంట పాపం.! ఇదివరకు 'ఇంటామె'కే సరిగ్గా ఇలానే దొరికితే.. ఇదే కథ చెప్పి మరోసారి తాను పొరపా టున కూడా 'దేహశుద్ధి' చేయించుకోనని మాటిచ్చి నట్టు సతీమణి నోటివెంట వెలువడిన 'బూతుపురా ణం' నుంచి దొర్లిన 'నగ్న సత్యాలంట ఇవి.!

## 'ఆమె'కు..'ప్రైవేట్ మెడికల్ క్లినిక్' పెట్టిస్తాని హామీ.?

దయామయుడైన డాక్టరయ్య.. తనకు 'స్వర్గ సుఖాలు' అందించినందుకు 'ప్రేమకానుక'గా.. ఆమెకు ఓ 'ప్రైవేట్ మెడికల్ క్లినిక్'ను కూడా పెట్టిస్తాని హామీనిచ్చినట్టు 'సతీమణి'కి తెలియడంతో అగ్గిమీద గుగ్గిలమే అయ్యిందట.? అందుకుగాను దాదాపు ఏర్పాట్లు కూడా పూర్తయినట్టు విశ్వసనీయుల మధ్య గుసగుసల టాపిక్.!






## ఓపీ.. సేవలకు విరామం.. యాజమాన్యం మౌనం.?

డాక్టర్ 'శృంగార పురుష్'డికి 'దేహశుద్ధి' ఘటన జరిగిన సందర్భంగా.. 'ఓపీ' సేవలకు విరామం మిచ్చినట్టుగా గత 4-5 రోజుల నుంచి వైద్యసేవలు నిలిచిపోయని సమాచారం.! ఈ 'ఓపీ' వెనుక జరిగిన అసలు విషయం ఎవరికీ చెప్పుకోలేని విపత్కర పరిస్థితుల్లో యాజమాన్యం 'నవరంధ్రాలు' మూసుకున్నట్టు తెలుస్తోంది.! 'సంతానయోగం' లేదన్న విభేదాల మధ్య కూడా మారని వైఖరితో విలాసాల్లో మునిగిన ఈ 'వైద్యుడి' నైతికత ఎక్కడికి పోయింది.? వైద్య వృత్తి పవిత్రతను కాలరాసి, జనాల నమ్మకాన్ని డబ్బు ముందు త్యాగం చేసిన ఈ సంఘటనలో హాస్పిటల్ యాజమాన్యం బాధ్యత ఎంత.?వైద్యం కాదు... విలాసం కావాలని ఆశించిన వైద్యుడి వైఖరి..ఇది కేవలం 'ఒక కుటుంబ కథ' మాత్రమే కాదు, మొత్తం సమాజానికే ఓ హెచ్చరిక వంటిది..ఏది ఏమైనా డాక్టర్ 'శృంగార పురుష్'డి దేహశుద్ధి కథ మాత్రం 'హాట్ టాపిక్'గా మారింది.!!



జగిత్యాల జిల్లా కోరుట్లలో 'ఫ్రెండ్లీ పోలీసింగ్' ద్వారా ప్రజల్లో విశ్వాసం పెంచాలని పోలీసు శాఖ చేస్తున్న ప్రయత్నాలకు గత ఏడాది కాలంలో జరిగిన పలు దాడి ఘటనలు ఎదురుదెబ్బలు కొట్టాయి. 'మత్తు' పదార్థాలు, గ్రూప్ క్లాష్‌లు, వాగ్వివాదాలు .. ఇవన్నీ పోలీసుల మనోధైర్యాన్ని పరీక్షిస్తున్నాయి.! తాజాగా వేములవాడ రోడ్‌పై గంజాయి స్మగ్లర్ ఎండి. యాసిన్ దాడి ఈ సమస్యను మరోసారి బయటపెట్టింది.పోలీసులు వీలైనంత వరకు సంయమనంతోనే వ్యవహరిస్తున్నప్పటికీ.. రాజకీయ ఒత్తిళ్లు..మత్తు బానిసలకు.. వారికి సప్లై చేస్తున్న స్మగ్లర్లకు పోలీసుల సమర్థతను.. సహనాన్ని అలుసుగా తీసుకుని రెచ్చిపోతున్నారు.! ఇది మరింత ముదరక ముందే.. పోలీసు అధికారులు తమ సత్తా చూపాల్సిన అవసరం ఉందని కోరుట్ల ప్రజలు చర్చించుకుంటున్నారు.!

నేటి సాక్షి – కోరుట్ల ( రాధారపు నర్సయ్య )



# 'ఫ్రెండ్లీ పోలీస్'కు..
# క్రిమినల్స్ ఝలక్..!



- గత ఏడాదిలో కోరుట్లలో పెరిగిన పోలీసులపై దాడులు
- గంజాయి మత్తు, గ్రూప్ క్లాష్ లు, ఆకతాయిల వీరంగం

- ప్రజలకు భరోసా కావాలని ప్రయత్నించే పోలీసులపై మద్యం-గంజాయి మత్తులో దాడులు..
- మనిషిని 'మత్తు'మృగంలా మారుస్తోంది
- గంజాయి స్మగ్లర్ యాసిన్ ఘటన మరో హెచ్చరిక







### సినిమా ఫక్కీలో.. పోలీసులపై యాసిన్ దాడి.!


కోరుట్ల పట్టణంలోని వేములవాడ రోడ్‌లో వాహన తనిఖీలు జరుపుతున్న పోలీసులు, నిజామాబాద్ నుంచి గంజాయి తీసుకొస్తున్న స్థానిక ఐబి రోడ్డుకు చెందిన ఎండి. యాసిన్ (26) అనే వ్యక్తిని నమ్మదగిన సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నారు. ప్రభుత్వ పంచుల సమక్షంలో అతని వద్ద ఉన్న గంజాయిని చెక్ చేస్తుండగా, యాసిన్ డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ ప్రణయ్'పై హఠాత్తుగా దాడి చేసి పారిపోయేందుకు ప్రయత్నించాడు.

### ఛేజింగ్ చేసి పట్టుకున్న ఎస్ఐ చిరంజీవి బృందం

కోరుట్ల ఎస్ఐ చిరంజీవి నేతృత్వంలోని సిబ్బంది అప్రమత్తంగా చేజ్ చేసి యాసిన్‌ను పట్టుకున్నారు. అతని వద్ద నుంచి సుమారు 50 గ్రాముల గంజాయి, సెల్‌ఫోన్..బైక్'ను సీజ్ చేశారు. ఎన్డిపిఎస్ ఆక్ట్ కింద.. ప్రభుత్వ ఉద్యోగి పై దాడి చేసిన కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిరంజీవి తెలిపారు.







### 'గ్రూప్ క్లాష్'లో ఇద్దరు కానిస్టేబుల్స్'కి గాయాలు

కోరుట్ల టౌన్‌లో గత ఆగస్టులో రెండు గ్రూపుల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఘర్షణను అదుపు చేయడానికి వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ జావేద్, బ్లూ కోర్ట్ కానిస్టేబుల్ గంగాధర్ దాడికి గురయ్యారు. డయల్-100 కాల్ మేరకు వచ్చిన పోలీసులు ఘర్షణలో చిక్కుకుని గాయపడ్డారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకున్నప్పటికీ, ఈ ఘటన పోలీసుల రక్షణ అవసరాన్ని మరోసారి ఉద్ఘాటించింది.

### తాళ్లచెరువు ప్రాంతంలో తాగుబోతుల అల్లరి-దాడి

అదే ఆగస్టు నెలలో పట్టణ శివారులోని తాళ్లు చెరువు కట్టపై అర్ధరాత్రి తాగుబోతులు మద్యం సేవిస్తూ అల్లరి చేస్తుండగా, స్థానికులు డయల్-100కు సమాచారం ఇచ్చారు. బ్లూ కోర్ట్ సిబ్బంది కానిస్టేబుల్ గంగాధర్.. మరియు హోంగార్డ్ జహీర్ స్థలానికి చేరుకున్నారు. మద్యం మత్తులో ఉన్న యువకులు పోలీసులపై దాడి చేశారు. హోంగార్డ్ జహీర్ గాయపడ్డాడు. దాడి చేసినవారు పారిపోయారు. ఈ ఘటన కోరుట్లలో తాగుబోతుల అల్లరి ప్రమాదకర స్థాయికి చేరుకుందని చర్చలు జరిగాయి.

### మత్తు పదార్థాలు –పోలీసులకు పెద్ద సవాలు

గత ఏడాది కాలంలో కోరుట్లలో జరిగిన ఈ దాడి ఘటనలన్నీ చూస్తే ఒక విషయం స్పష్టమవుతోంది.. మద్యం-గంజాయి వంటి మత్తు పదార్థాలు యువతను మృగంలా మార్చి, చట్టాన్ని గౌరవించే భావనను క్షీణింపజేస్తున్నాయి. గ్రూప్ క్లాష్‌లు, వాగ్వివాదాలు, తాగుబోతుల ఆగడాలు..ఇవన్నీ పోలీసులు రంగప్రవేశం చేసినప్పుడే దాడులుగా మారుతున్నాయి.

ఫ్రెండ్లీ పోలీసింగ్' ద్వారా 'పోలీసు అంటే భయం కాదు..ఓ భరోసా.!' అనే సందేశం అందించాలని ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో ఇలాంటి ఘటనలు పోలీసుల మనోధైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. 'సేవ చేయాలనుకున్నవారికి రక్షణ అవసరమ'నే అభిప్రాయం బలపడుతోంది.

### 'కఠిన చర్యలు ఖచ్చితంగా అవసరం

మత్తు పదార్థాల విక్రయాలు.. వినియోగంపై కఠిన చర్యలు, యువతలో అవగాహన కార్యక్రమాలు, పోలీసులకు మెరుగైన రక్షణ చర్యలు – ఇవి తక్షణం అమలు చేయాల్సిన అవసరం ఉంది. చట్టాన్ని గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అనే సందేశం సమాజంలో మరింత బలంగా వ్యాప్తి చెందాలి.ఎస్ఐ చిరంజీవి అతని పోలీస్ బృందం తాజా ఘటనలో చూపిన అప్రమత్తత ప్రశంసనీయం. అయితే, ఒకవైపు ప్రజలకు చేరువవుతున్న పోలీస్ వ్యవస్థ... మరోవైపు దాడులకు గురవుతున్న పరిస్థితి – ఇది సమాజానికి, ప్రభుత్వానికి ఒకేసారి సవాలు మరియు హెచ్చరిక.'ఫ్రెండ్లీ పోలీస్' విజయవంతం కావాలంటే పోలీసులకు ప్రజల మద్దతు అత్యంత అవసరం. మత్తు దురలవాట్ల నుంచి యువత దూరంగా ఉండాలి. చట్టం ప్రకారం ప్రవర్తించడం మాత్రమే సమాజాన్ని సురక్షితంగా, శాంతియుతంగా మార్చగలదు. గత ఏడాది కాలంలో పోలీసులపై దాడి ఘటనలు..ఈ క్రిమినల్స్ ఇస్తున్న 'ఝలక్'లను మరచిపోకుండా చూసుకోవాల్సిన బాధ్యత పోలీసులపైనే ఉంది.!